# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 8 | శనివారం | 22.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 8 | Saturday | 22.08.2026 | Pages: 8 | Rate: 2




## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు నో పర్మిషన్

**అమెరికా పర్యటనకు కేంద్రం రెడ్ సిగ్నల్**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రోటోకాల్ ప్రకారం యూకే, అమెరికా పర్యటనలకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కేంద్ర అనుమతి కోరింది. తొలుత యూకే పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. ప్రతినిధి బృందం యూకే చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. రాజకీయ కారణాలతోనే అనుమతి నిరాకరించారన్న కేంద్ర వివరణపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)

## యూకేకు ఓకే..అమెరికాకు నో ?

**సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఎందుకు ఆగింది!**



## అక్కడ మగువలదే పైచేయి

- పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ
- జూబ్లీహిల్స్‌లో నారీమణులదే బలం!
- లక్షన్నర మంది ఓటర్లు షిఫ్ట్ అయ్యారా?

హైదరాబాద్‌లో రాజకీయంగా కీలకమైన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్ల లెక్కలు ఆసక్తికరంగా మారాయి. ఇటీవల జరిగిన ఉప ఎన్నిక తర్వాత వచ్చిన తాజా ఓటర్ల జాబితాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మొత్తం 2,27,219 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,14,513 మంది, పురుషులు 1,12,697 మంది ఉన్నారు. అంటే పురుషుల కంటే మహిళా ఓటర్లు ఏకంగా 1,816 మంది అధికంగా ఉన్నారు. మరోవైపు ఇతర కేటగిరీలో 9 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో జూబ్లీహిల్స్‌లో పురుష ఓటర్లే ఎక్కువగా ఉండేవారు. (వివరాలు 2లో..)




## ఆమె చేసిన నేరమేంటి..?

- 27 కత్తిపోట్లకు కారణమేంటి?
- హత్య తర్వాత కూడా వెంటాడుతున్న ప్రశ్నలు

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య మనసును కలచివేస్తోంది. ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఒక ఉపాధ్యాయురాలు ఇక లేరు. కానీ ఆమె మరణంతో ముగియాల్సిన ప్రశ్నలు ఇప్పుడు మరో రూపంలో మన ముందుకొస్తున్నాయి. ఆమె చేసిన నేరమేంటి..? 27 కత్తిపోట్లు పడేంతటి తప్పు ఆమె ఏం చేసింది..? విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని క్రమశిక్షణ నేర్పడం నేరమా? పాఠశాల బాధ్యతలు నిర్వర్తించడం నేరమా? తప్పు చేసిన విద్యార్థిని ప్రశ్నించడం నేరమా? హత్యకు గురైన వ్యక్తి గురించి దర్యాప్తు జరగడం సహజం. పోలీసులు ప్రతి కోణాన్ని పరిశీలించాలి. కుటుంబ సభ్యులను ప్రశ్నించాలి. ఆధారాలను సేకరించాలి. అసలు నిజాన్ని వెలికి తీయాలి. కానీ దర్యాప్తు పేరుతో పుట్టిన అనుమానాలు మీడియా కథనాల్లో తీర్పులుగా మారితే? మృతురాలి వ్యక్తిత్వమే చర్చగా మారితే? భర్తను ఆధారాలు లేకుండా అనుమానాల బోనులో నిలబెడితే? ఒక కుటుంబం ప్రాణం కోల్పోయిన బాధతో విలవిల్లాడుతున్న సమయంలో వారిపైనే ప్రజా విచారణ మొదలైతే? ఇక్కడ అసలు ప్రశ్న హంతకుల కోసం జరగాల్సిన దర్యాప్తు ఎందుకు మృతురాలి క్యారెక్టర్‌పైకి మళ్లింది అన్నదే. ఒక మనిషిని చంపిన తర్వాత కూడా ఆమెను సమాజం విచారించాల్సిందేనా? లేక ఆమెకు న్యాయం చేయాల్సిందేనా? ఇదే ఇప్పుడు మనస్సాక్షిని కదిలించే ప్రశ్న.

## కొండా ఫ్యామిలీపై నిప్పులు..

# సస్పెన్షన్ దిశగా స్టెప్పులు

**ఇక లేటు చేయొద్దు.. వేటు వేయాల్సిందే..!**




- కొండపై కాంగ్రెస్ నేతల బండ
- 18 మంది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల దాడి
- సుస్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లో మంటలు
- సీఎం రేవంత్‌పై మాటలతో సొంత పార్టీలో రగడ

- సురేఖపై చర్యలకు రంగం సిద్ధం?
- సుస్మిత వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కాక

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర ప్రకంపనలు రేపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై ఆమె చేసిన విమర్శలను పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

- సురేఖపై సొంత పార్టీ నేతల ఫైర్
- కాంగ్రెస్‌లో మాటల మంట.. రచ్చ రచ్చ

తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడొకటే టాపిక్.. కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫైర్. సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుశ్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీలో చిచ్చు పెట్టాయి. ఏకంగా 18 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక్కటై సుశ్మిత వ్యాఖ్యలను ఖండించడంతో వ్యవహారం మామూలు రచ్చగా మిగల్లేదు. "సీఎంను టార్గెట్ చేస్తే ఊరుకునేది లేదు.. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలు తప్పవు" అంటూ నేతలు గట్టిగానే వార్నింగ్ ఇచ్చారు. కొందరైతే కొండా సురేఖ కూడా దీనిపై స్పష్టంగా స్పందించి, అవసరమైతే పార్టీ నుంచి తప్పుకోవాలంటూ డిమాండ్ చేసే స్థాయికి వెళ్లారు. మరోవైపు సురేఖ మాత్రం "చెప్పాల్సిందంతా క్రమశిక్షణ కమిటీకి చెప్పా.. కొత్తగా చెప్పేదేమీ లేదు" అంటూ మీడియాకు గేట్లు మూసేశారు. సీఎం విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతానని చెప్పి సస్పెన్స్ పెంచారు. ఈ మొత్తం ఎపిసోడ్‌పై సీపీఐ నేత కె. నారాయణ తనదైన శైలిలో "కాంగ్రెస్‌లో సవతుల పోరు నడుస్తోంది" అంటూ సెటైర్ వేశారు. ఇంటిపోరు ఇలాగే కొనసాగితే బీఆర్ఎస్ మళ్లీ పుంజుకునే ఛాన్స్ ఉందంటూ జోస్యం చెప్పారు. దీంతో అటు సురేఖ వైఖరి.. ఇటు సొంత పార్టీ నేతల డిమాండ్లు.. మధ్యలో నారాయణ సెటైర్లు.. తెలంగాణ కాంగ్రెస్‌లో అసలు కథ ఇప్పుడే మొదలైందా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా నడుస్తోంది.

### చెప్పాల్సింది చెప్పా... కొత్తగా చెప్పేదేం లేదు

**క్రమశిక్షణ కమిటీకి సమాధానం ఇచ్చానన్న కొండా**



కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీకి తన వివరణ ఇచ్చినట్లు మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. షోకాజ్ నోటీసుకు చెప్పాల్సినసమాధానాన్ని ఇప్పటికే కమిటీకి చెప్పానని, ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలు ఏవీ లేవని ఆమె తెలిపారు.

### తెలంగాణ కాంగ్రెస్‌లో సవతుల పోరు

**అంతర్గత కలహాలతో బీఆర్ఎస్‌కు బలం**

**తీవ్ర వ్యాఖ్యలు చేసిన సీపీఐ నారాయణ**



తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు కొనసాగుతోందని సీపీఐ సీనియర్ నేత కె. నారాయణ విమర్శించారు. కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గత విభేదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితి ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మళ్లీ బలం చేకూరుస్తోందని అన్నారు.




## సోమవారం నుంచి కొత్త రూల్స్

**సిమ్ కార్డులపై కేంద్రం నిబంధనలు**

**తొమ్మిది సిమ్‌లకు మించి ఇక నో**

మొబైల్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకొచ్చింది. ఆగస్టు 24, 2026 నుంచి ఒక వ్యక్తి పేరుతో ఉన్న సిమ్ కార్డుల సంఖ్యను టెలికాం సంస్థలు మరింత కఠినంగా తనిఖీ చేయనున్నాయి. దేశవ్యాప్తంగా ఒక వ్యక్తి పేరుతో గరిష్ఠంగా 9 మొబైల్ కనెక్షన్లు మాత్రమే ఉండొచ్చు. ఇప్పటికే 9 కనెక్షన్లు ఉన్న వ్యక్తి మరో కొత్త సిమ్ కోసం దరఖాస్తు చేస్తే దాన్ని తిరస్కరించాలని టెలికాం సంస్థలకు కేంద్రం ఆదేశించింది. జమ్మూకశ్మీర్, అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం గరిష్ఠ పరిమితి 6 కనెక్షన్లుగా ఉంది. ఈ పరిమితి అన్ని టెలికాం సంస్థలు, దేశంలోని అన్ని లైసెన్స్‌డ్ సర్వీస్ ఏరియాలకు కలిపి వర్తిస్తుంది. (వివరాలు 2లో..)



## ఎకరా రూ.264 కోట్ల రికార్డు

**రాయదుర్గం భూములకు రికార్డు ధర**

**సుప్రీం గ్రీన్ సిగ్నల్.. వేలంలో దూకుడు**

హైదరాబాద్ రాయదుర్గం పాన్‌మక్తా భూములు మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. ఒకే రోజు రికార్డు స్థాయిలో ఎకరాకు రూ.264 కోట్ల ధర పలకడం, మరోవైపు ఈ భూముల వేలంపై సుప్రీంకోర్టు జోక్యానికి నిరాకరించడం కీలక పరిణామాలుగా నిలిచాయి. పాన్‌మక్తాలోని సర్వే నంబర్ 83/1లో 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరా రూ.264 కోట్లకు అమ్ముడైంది. మొత్తం 5.25 ఎకరాలను ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ దక్కించుకుంది. ఎకరాకు రూ.175 కోట్ల కనీస ధర నిర్ణయించగా, బిడ్డింగ్ చివరకు రూ.264 కోట్లకు చేరింది. (వివరాలు 2లో..)

# షుగర్ పెరిగింది..

**సామాన్యుడి తల తిరిగింది**

చాయ్‌లో రెండు చెంచాల చక్కెర వేసుకునే సామాన్యుడికి ఇప్పుడు లెక్కలు మొదలయ్యాయి. కిలో చక్కెర ధర ఒక్క నెలలోనే భారీగా పెరగడంతో వంటింటి బడ్జెట్‌పై మరో భారం పడింది. అసలు చక్కెర ధర ఎందుకు మండుతోంది? దేశంలో చక్కెర ఉత్పత్తి తగ్గడం, పండుగల ముందు డిమాండ్ పెరగడం, అధిక వర్షాలతో చెరకు పంట దెబ్బతినడం, ప్రపంచ మార్కెట్లో సరఫరా తగ్గడం, కొందరు వ్యాపారుల నిల్వలు, ఊహాగానాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయని కేంద్రం చెబుతోంది. దేశీయ ఉత్పత్తి అంచనా 343 లక్షల టన్నుల నుంచి 306 లక్షల టన్నులకు తగ్గే అవకాశం ఉండటంతో సరఫరాపై ఒత్తిడి పెరిగింది. మరోవైపు పండుగల సీజన్ దగ్గరపడుతోంది. అంటే ఒకవైపు చక్కెర తక్కువ.. మరోవైపు తీపి కోసం డిమాండ్ ఎక్కువ. ఇదే సమయంలో ఎథనాల్ విధానం చుట్టూ రాజకీయ దుమారం మొదలైంది. చెరకు వినియోగం ఇంధనం వైపు మళ్లడంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. కేంద్రం మాత్రం ఎథనాల్ కోసం మళ్లించే చక్కెర వాటా తగ్గిందని చెబుతోంది. ధరలు అదుపులోకి తెచ్చేందుకు 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు కేంద్రం అనుమతించింది. కానీ సామాన్యుడి ప్రశ్న మాత్రం ఒక్కటే.. దేశంలో చక్కెర కొరత వస్తే దిగుమతులు, ధరలు పెరిగితే నియంత్రణలు, మరి ఈ మధ్యలో తన జేబు కరిగిపోవడానికి కారణమేంటి? చివరకు షుగర్ ధర పెరిగిందా.. లేక సామాన్యుడి షుగర్ కూడా పెంచే దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందా? చాయ్ తీపి తగ్గించుకోవాలా, లేక ఇంటి ఖర్చులే తగ్గించుకోవాలా అన్నదే ఇప్పుడు సామాన్యుడి ఆవేదన. వాహనం నడపాలన్నా ఖర్చే.. వంటింట్లో తీపి కావాలన్నా ఖర్చే. సామాన్యుడి జేబుకు మాత్రం ప్రతిరోజూ కొత్త షాక్!




### చక్కెర ధరలకు కేంద్రం చెక్

- **దిగుమతులతో ధరలకు బ్రేక్**

దేశంలో చక్కెర ధరలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అక్టోబర్ 31, 2026 వరకు 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. దేశీయ మార్కెట్లో చక్కెర లభ్యత పెంచడం, ధరల పెరుగుదలను నియంత్రించడం ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం చక్కెర ఎక్స్‌మిల్ ధరలు గణనీయంగా పెరిగాయి. (వివరాలు 3లో..)

### చక్కెర ధరల మంట ఎందుకు?

- **పెరుగుదల వెనుక 5 కారణాలు**

చక్కెర ధరలు ఒక్కసారిగా పెరగడంతో అసలు కారణాలపై చర్చ మొదలైంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా చక్కెర ధరలు పెరగడానికి ఐదు ప్రధాన కారణాలు ఉన్నాయని వెల్లడించింది. దేశీయ ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం, పండుగల ముందు డిమాండ్ పెరగడం, వాతావరణం కారణంగా చెరకు పంట దెబ్బతినడం, (వివరాలు 3లో..)



### చక్కెర ధరలపై కేజ్రీవాల్ ఫైర్

**షుగర్ రేట్స్ పెంపుపై ఆప్ దాడి**

దేశంలో చక్కెర ధరలు భారీగా పెరగడంపై ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా టార్గెట్ చేసింది. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వ విధానాలే ప్రస్తుత పరిస్థితికి కారణమని ఆరోపించారు. ఎథనాల్ తయారీ కోసం చెరకును మళ్లించడం వల్ల చక్కెర ఉత్పత్తి తగ్గిపోయిందని, ఫలితంగా కేవలం 17 రోజుల్లోనే కిలో చక్కెర ధర రూ.20 పెరిగిందని ఆయన అన్నారు.



### ఇథనాల్‌కి షుగర్ ధరలకు లింకేంటి?

**ఈ 20..కేంద్రంపై కాంగ్రెస్ ఫైర్**

**పెట్రోల్ పాలసీపై రివ్యూ డిమాండ్**

**వాహనం ఖర్చా.. వంటింటి ఖర్చా?**



# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు నో పర్మిషన్

## అమెరికా పర్యటనకు కేంద్రం రెడ్ సిగ్నల్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రోటోకాల్ ప్రకారం యూకే, అమెరికా పర్యటనలకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కేంద్ర అనుమతి కోరింది. తొలుత యూకే పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. ప్రతినిధి బృందం యూకే చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. రాజకీయ కారణాలతోనే అనుమతి నిరాకరించారన్న కేంద్ర వివరణపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు.

**యువత భవిష్యత్తే అసలు లక్ష్యం**

ఈ పరిణామంపై రేవంత్ రెడ్డి ఆలోచన స్పష్టంగా ఉంది. అమెరికా పర్యటన రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, తెలంగాణ యువత భవిష్యత్తు కోసం అని ఆయన చెబుతున్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలను హైదరాబాద్‌కు తీసుకురావడం, విద్య, నైపుణ్యాలు, శిక్షణ రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలు సాధించడం పర్యటన ప్రధాన లక్ష్యమని వివరించారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎల్ఎస్ఈ వంటి సంస్థల స్థాయి విద్యా అవకాశాలు తెలంగాణలోనే అందుబాటులోకి రావాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయంలో రాజకీయాలను పక్కన పెట్టాలని సీఎం అభిప్రాయపడ్డారు. కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ అమెరికా వెళ్లకూడదని నిర్ణయించినా, ఇప్పటికే జరిగిన సంప్రదింపులను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

**హైదరాబాద్‌ను నాలెడ్జ్ హబ్‌గా మార్చే సంకల్పం**

అమెరికా పర్యటన రద్దయినా లక్ష్యం మాత్రం మారలేదని సీఎం స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తన సంకల్పమని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ, హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ, ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థలు నగరానికి ఇప్పటికే బలమైన విద్యా పునాదిని ఇచ్చాయని పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలు, నైపుణ్య సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే ప్రక్రియను అధికారులు కొనసాగించాలని సూచించారు. యూకే పర్యటనలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఎల్ఎస్ఈ, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ వంటి సంస్థలతో సమావేశాలు కొనసాగనున్నాయి.

## యూకేకు ఓకే.. అమెరికాకు నో ?

### సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఎందుకు ఆగింది!

కేంద్రం అనుమతి నిరాకరించడంతో సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దయింది. అయితే ఈ నిర్ణయానికి కేంద్రం చెప్పిన కారణం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం ముఖ్యమంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లేటప్పుడు వారి హోదాకు, పర్యటన ఉద్దేశానికి తగిన కార్యక్రమాలకే రాజకీయ అనుమతి ఇస్తారు. అమెరికా పర్యటనలో ప్రతిపాదించిన కార్యక్రమాలు సీఎం హోదాకు, పర్యటన ఉద్దేశానికి తగినవిగా లేవని కేంద్రం స్పష్టం చేసింది. అదే సమయంలో యూకే పర్యటనకు మాత్రం కేంద్రం అనుమతి ఇచ్చింది. దీంతో రెండు దేశాల పర్యటనలో ఒకదానికి అనుమతి ఇచ్చి, మరోదానికి ఎందుకు నిరాకరించారన్న ప్రశ్నలు మొదలయ్యాయి.

**రాజకీయ కారణాలంటున్న రేవంత్ వర్గం**

తెలంగాణ ప్రభుత్వం మాత్రం కేంద్రం నిర్ణయాన్ని మరో కోణంలో చూస్తోంది. యూకే, అమెరికా పర్యటనలకు నిబంధనల ప్రకారం ముందుగానే అనుమతి కోరామని సీఎం కార్యాలయం చెబుతోంది. తొలుత యూకేకు మాత్రమే అనుమతి వచ్చింది. అధికారిక బృందం యూకే చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వబోమని కేంద్రం సమాచారం ఇచ్చింది. రాజకీయ కారణాలతోనే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించారని రేవంత్ రెడ్డి కార్యాలయం ఆరోపించింది. అమెరికాలో హార్వర్డ్, ఎంఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థలను సందర్శించడం, విశ్వవిద్యాలయ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం, తెలంగాణ యువతకు విద్య, నైపుణ్య అవకాశాలు పెంచే భాగస్వామ్యాలపై చర్చించడం పర్యటనలో భాగంగా ఉన్నాయి. బోస్టన్‌లో వర్జీనియా టెక్ ప్రతినిధులతో సమావేశం, న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ కార్యక్రమం కూడా షెడ్యూల్‌లో ఉన్నాయి. కేంద్ర నిర్ణయం నేపథ్యంలో బోస్టన్ వెళ్లకుండా లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగి రావాలని సీఎం నిర్ణయించారు.

# కొండా ఫ్యామిలీపై నిప్పులు.. సస్పెన్షన్ దిశగా స్టెప్పులు..

**ఇక లేటు చేయొద్దు.. వేటు వేయాల్సిందే..!**

- 18 మంది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల దాడి
- సుస్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లో మంటలు
- సీఎం రేవంత్‌పై మాటలతో సొంత పార్టీలో రగడ

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. సుస్మిత వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని, అవి పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని కొండా సురేఖ క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చారు. దీనిపై కాంగ్రెస్‌కు చెందిన 18 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు బాలు నాయక్, నాయిని రాజేందర్ రెడ్డి తదితరులు సురేఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుస్మిత వ్యాఖ్యలతో సంబంధం లేకపోతే మంత్రి స్వయంగా ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. సొంత పార్టీ నేతలు ముఖ్యమంత్రిపై బహిరంగంగా విమర్శలు చేయడం పార్టీకి నష్టం చేస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు.

**రేవంత్‌ను బలహీనపరుస్తున్నారా?**

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి ఎంతో కష్టపడ్డారని గుర్తుచేశారు. అలాంటి ముఖ్యమంత్రిపైనే సొంత పార్టీ నేతలు విమర్శలు చేయడం బాధాకరమని అన్నారు. వేముల వీరేశం కూడా సురేఖ స్పందించి తన కుమార్తె వ్యాఖ్యలను ఖండించాలని డిమాండ్ చేశారు. సురేఖ గతంలో చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా పార్టీకి ఇబ్బందులు తెచ్చాయని విమర్శించారు. పార్టీ వేదికపై చర్చించాల్సిన విషయాలను బయటకు తీసుకురావడం సరికాదన్నారు. ముఖ్యమంత్రిని బలహీనపరిచే ప్రయత్నాలను సహించబోమని, సీఎం నిర్ణయాలను తప్పుబట్టేవారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. బాలు నాయక్ మాట్లాడుతూ పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే కులం, హోదాతో సంబంధం లేకుండా చర్యలు ఉండాలని కోరారు. షోకాజ్ నోటీసులతోనే వ్యవహారం ముగిసిందని భావించకూడదని స్పష్టం చేశారు.

**సురేఖపై రాజేందర్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు**



ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొండా సురేఖపై మరింత ఘాటుగా స్పందించారు. ప్రభుత్వంలో ఉంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం దుర్మార్గమని విమర్శించారు. నిరాధార ఆరోపణలతో ప్రతిపక్షాలకు ఆయుధాలు అందిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రేవంత్ రెడ్డి కీలకంగా పనిచేశారని, పార్టీని బలహీనపరిచే ప్రయత్నాలను సహించబోమని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే పార్టీ అధిష్ఠానం వద్దే పరిష్కరించుకోవాలని సూచించారు. బహిరంగ విమర్శలతో పార్టీకి నష్టం చేయొద్దని హెచ్చరించారు. సొంత పార్టీ నేతలే సీఎంపై మాట్లాడితే చర్యలు తప్పవన్న డిమాండ్ ఇప్పుడు కాంగ్రెస్‌లో బలంగా వినిపిస్తోంది. సుస్మిత వ్యాఖ్యలపై సురేఖ స్పష్టమైన ఖండన చేయాలన్న ఎమ్మెల్యేల డిమాండ్‌తో ఈ వివాదం మరింత ముదిరే పరిస్థితి కనిపిస్తోంది.

## సురేఖపై చర్యలకు రంగం సిద్ధం?

**సుస్మిత వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కాక**

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర ప్రకంపనలు రేపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై ఆమె చేసిన విమర్శలను పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కేవలం షోకాజ్ నోటీసుతో వ్యవహారాన్ని ముగించకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఢిల్లీలో ఉన్న సమయంలోనే కొందరు ముఖ్య నేతలతో సీఎం మాట్లాడినట్లు, ఉప ముఖ్యమంత్రి, మంత్రులతోనూ చర్చించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పీసీసీ క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని సురేఖ ఇచ్చిన వివరణ ఇప్పుడు పార్టీ పరిశీలనలో ఉంది.

**పరకాలే అసలు రాజకీయ కేంద్రం**

ఈ వివాదానికి పరకాల రాజకీయ పరిణామాలు మరింత వేడి పెంచుతున్నాయి. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించిన సమయంలో స్థానిక మంత్రి కొండా సురేఖ కార్యక్రమాలకు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో సురేఖ వర్గానికి విభేదాలు ఉన్నట్లు చాలాకాలంగా ప్రచారం ఉంది. సీఎం పరకాల సభలో వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరడం రాజకీయంగా కీలక సంకేతంగా మారింది. దీనికి మరుసటి రోజే సుస్మిత పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ నిర్వహించి సీఎం, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేయడం మరింత చర్చకు దారితీసింది. అంతేకాదు వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించడం పార్టీ నాయకత్వానికి మరింత ఇబ్బందికరంగా మారింది. టికెట్లు ఎవరు పొందాలన్నది పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు.

**షోకాజ్ తర్వాత ఏం జరుగుతుంది?**

ఇదే సమయంలో కొండా సురేఖ మాజీ ఓఎస్‌డీ సుమంత్‌పై వ్యాపారిని బెదిరించి దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదవడం కూడా తాజా పరిణామాలకు మరో కోణాన్ని జోడించింది. గతంలో ఇలాంటి వ్యవహారాల్లో సుస్మిత చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీసిన విషయాన్ని పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. అప్పట్లో కొందరు నేతల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగినా, ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా బహిరంగంగా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని పీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేయడం ఈ వివాదానికి ప్రాధాన్యత పెంచింది. మరోవైపు ఇలాంటి అంశాల్లో తొందరపడకుండా ఆచితూచి నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయం కూడా పార్టీలో ఉంది. దీంతో ఇప్పుడు అందరి చూపు సురేఖ వివరణపై పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపైనే ఉంది. సుస్మిత వ్యాఖ్యలు, పరకాల టికెట్ వివాదం, సీఎం అసంతృప్తి, పార్టీ నేతల బహిరంగ వ్యతిరేకత.. ఇవన్నీ కలిసిపోవడంతో కొండా సురేఖపై చర్యలు తప్పవా అన్న చర్చ కాంగ్రెస్‌లో వేడెక్కుతోంది.

## చెప్పాల్సింది చెప్పా... కొత్తగా చెప్పేదేం లేదు

**క్రమశిక్షణ కమిటీకి సమాధానం ఇచ్చానన్న కొండా**



కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీకి తన వివరణ ఇచ్చినట్లు మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. షోకాజ్ నోటీసుకు చెప్పాల్సిన సమాధానాన్ని ఇప్పటికే కమిటీకి చెప్పానని, ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలు ఏవీ లేవని ఆమె తెలిపారు. ఈ అంశంపై మీడియాతో ప్రస్తుతం మాట్లాడబోనని సురేఖ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత మాట్లాడతానని చెప్పారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనికి స్పందిస్తూ కమిటీ చైర్మన్‌కు సురేఖ లిఖితపూర్వక వివరణ పంపారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి తనను బాధ్యురాలిని చేయవద్దని సురేఖ తన వివరణలో పేర్కొన్నట్లు సమాచారం.

**సీఎం తిరిగొచ్చాక మాట్లాడతా..**

సుస్మిత వ్యాఖ్యల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన విమర్శలు కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు కారణమయ్యాయి. ముఖ్యమంత్రి కూడా ఈ వ్యవహారంపై అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. కేవలం షోకాజ్ నోటీసుతో వ్యవహారం ముగుస్తుందా? లేక తదుపరి క్రమశిక్షణ చర్యలు ఉంటాయా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుస్మిత వ్యాఖ్యలను బహిరంగంగా ఖండించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే చర్యలు తప్పవన్న సంకేతాలు కూడా నాయకత్వం నుంచి వచ్చాయి. ఈ నేపథ్యంలో సురేఖ ఇచ్చిన వివరణపై క్రమశిక్షణా కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కీలకంగా మారింది. అయితే సురేఖ మాత్రం ప్రస్తుతానికి మీడియా చర్చకు దూరంగా ఉంటూ, సీఎం రేవంత్ విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాతే ఈ అంశంపై తన తదుపరి వైఖరిని వెల్లడించనున్నట్లు స్పష్టం చేశారు.

## తెలంగాణ కాంగ్రెస్‌లో సవతుల పోరు

- అంతర్గత కలహాలతో బీఆర్ఎస్‌కు బలం
- తీవ్ర వ్యాఖ్యలు చేసిన సీపీఐ నారాయణ



తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు కొనసాగుతోందని సీపీఐ సీనియర్ నేత కె. నారాయణ విమర్శించారు. కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గత విభేదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితి ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మళ్లీ బలం చేకూరుస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ తప్పులకు తావులేకుండా పాలన సాగిస్తేనే మంత్రులు, కిందిస్థాయి అధికారులు భయభక్తులతో పనిచేస్తారని సూచించారు. ఇకనైనా సీఎం రాజకీయ వ్యవహారాల కంటే పాలనపై ఎక్కువ దృష్టి పెట్టాలని నారాయణ హితవు పలికారు. 22ఏ భూముల నిబంధనను కొందరు తీవ్రంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి కాదని, ఎన్నికల సమయంలో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని స్పష్టం చేశారు. తమ పార్టీ చేసిన సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి క్రమంగా పెరుగుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే రాజకీయంగా అధికార పార్టీకి ఇబ్బందులు తప్పవని నారాయణ వ్యాఖ్యానించారు.

## అక్కడ మగువలదే పైచేయి

- పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ
- జూబ్లీహిల్స్‌లో నారీమణులదే బలం!
- లక్షన్నర మంది ఓటర్లు షిఫ్ట్ అయ్యారా?



హైదరాబాద్‌లో రాజకీయంగా కీలకమైన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్ల లెక్కలు ఆసక్తికరంగా మారాయి. ఇటీవల జరిగిన ఉప ఎన్నిక తర్వాత వచ్చిన తాజా ఓటర్ల జాబితాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండటం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. మొత్తం 2,27,219 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,14,513 మంది, పురుషులు 1,12,697 మంది ఉన్నారు. అంటే పురుషుల కంటే మహిళా ఓటర్లు ఏకంగా 1,816 మంది అధికంగా ఉన్నారు. మరోవైపు ఇతర కేటగిరీలో 9 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో జూబ్లీహిల్స్‌లో పురుష ఓటర్లే ఎక్కువగా ఉండేవారు. తాజా ఎస్ఐఆర్ సవరణ తర్వాత లెక్కలు పూర్తిగా మారిపోయాయి. దీంతో జూబ్లీహిల్స్‌లో ఎన్నికల సమీకరణాలపై కూడా కొత్త చర్చ మొదలైంది. మహిళా ఓటర్ల సంఖ్య పెరగడం.. రాజకీయ పార్టీలకు ఇది కీలక సంకేతంగా మారింది.

**1.48 లక్షల ఓట్లు ఎక్కడికి వెళ్లాయి?**

మహిళా ఓటర్ల ఆధిక్యం మాత్రమే కాదు.. జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితాలో మరో సంచలన లెక్క బయటపడింది. ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత 1,48,859 మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయినట్లు అధికారులు గుర్తించారు. మొత్తంగా 1,79,510 ఓట్లు జాబితాలో తిరిగి కనిపించలేదని లెక్కలు చెబుతున్నాయి. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య సుమారు 79 వేల వరకు పెరిగిన నేపథ్యంలో ఈ మార్పు మరింత ఆసక్తి రేపుతోంది. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వారిలో కొందరు తమ సొంత ప్రాంతాల్లో ఓటును కొనసాగించేందుకు మొగ్గు చూపినట్లు అధికారులు చెబుతున్నారు. బస్తీలు, హాస్టళ్లలో తాత్కాలిక చిరునామాలతో నమోదైన ఓట్లపైనా ప్రభావం పడింది. మ్యాచ్ కాని ఓట్లు 53,166, ఆబ్సెంట్ ఓట్లు 13,500, మరణించిన ఓట్లు 8,232, డూప్లికేట్ ఓట్లు 7,279గా గుర్తించారు.

**పార్టీల ఫోకస్ ఇప్పుడు మహిళలపైనే!**

జూబ్లీహిల్స్‌లో ఓటర్ల లెక్కలు మారడంతో రాజకీయ పార్టీల లెక్కలు కూడా మారుతున్నాయి. రహ్మత్‌నగర్, షేక్‌పేట, బోరబండ, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో ఓటర్ల మార్పు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. డివిజన్ల పునర్విభజన కూడా రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎస్ఐఆర్ ముసాయిదాపై అభ్యంతరాలు చెప్పేందుకు నెల రోజుల సమయం ఉండటంతో పార్టీలు తమ కార్యకర్తలను రంగంలోకి దించాయి. కనీసం 20 నుంచి 30 వేల ఓట్లను తిరిగి జాబితాలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో రాజకీయ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. అయితే ఈ మొత్తం లెక్కల్లో ఒక విషయం మాత్రం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఒకప్పుడు పురుష ఓటర్ల ఆధిక్యం ఉన్న జూబ్లీహిల్స్‌లో ఇప్పుడు మహిళలే ముందున్నారు. ఎన్నికల్లో ఎవరి వైపు మహిళా ఓటు బలం మొగ్గుతుంది? ఇదే ఇప్పుడు జూబ్లీహిల్స్ రాజకీయాల్లో అసలు ప్రశ్నగా మారింది.

## ఎకరా రూ.264 కోట్ల రికార్డు

### రాయదుర్గం భూములకు రికార్డు ధర



ఎకరాకు రూ.175 కోట్ల కనీస ధర నిర్ణయించగా, బిడ్డింగ్ చివరకు రూ.264 కోట్లకు చేరింది. ఇదే సర్వే నంబర్‌లో మే నెలలో జరిగిన వేలంలో ఎకరా రూ.237 కోట్లు పలికింది. అంటే కొద్ది నెలల్లోనే ధర మరింత పెరిగింది. ఖరీదైన ప్రాంతం కావడంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు పోటీపడగా, చివరికి ఎంఎస్ఎన్ రియాలిటీ అత్యధిక ధరతో భూమిని సొంతం చేసుకుంది.

**సుప్రీంకోర్టులో తొలగిన అడ్డంకి**


ఇదే సమయంలో రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలానికి ఉన్న న్యాయపరమైన అడ్డంకి కూడా తొలగింది. టీజీఐఐసీ వేలం ప్రక్రియను సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఏదైనా అభ్యంతరం ఉంటే హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ పిటిషనర్ తరఫు న్యాయవాది వేలాన్ని నిలిపివేయాలని కోరినా, రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఆ వాదనను వ్యతిరేకించారు. కంచ గచ్చిబౌలి భూములకు, పాన్‌మక్తా భూములకు సంబంధం లేదని, రెండూ సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు టీజీఐఐసీ నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోలేదు.

**అడ్డంకి తొలగడంతో రికార్డు బిడ్**

సుప్రీంకోర్టు జోక్యానికి నిరాకరించిన రోజే రాయదుర్గం భూములకు భారీ ధర రావడం ఇప్పుడు ప్రత్యేక చర్చకు కారణమైంది. పాన్‌మక్తా ప్రాంతంలోని రెండు సర్వే నంబర్లలో సుమారు 11 ఎకరాల భూములను విక్రయించేందుకు టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎకరాకు రూ.175 కోట్ల కనీస ధర నిర్ణయించింది. వేలం ప్రక్రియపై కోర్టులో సవాలు ఉన్నప్పటికీ, అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోకపోవడంతో వేలం కొనసాగింది. మరోవైపు రాయదుర్గం ప్రాంతంలో భూములకు ఉన్న భారీ డిమాండ్ బిడ్డింగ్‌లో స్పష్టంగా కనిపించింది. రూ.175 కోట్ల కనీస ధర నుంచి రూ.264 కోట్ల వరకు బిడ్ వెళ్లడం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో సంచలనంగా మారింది. కోర్టు అడ్డంకి తొలగడం, రికార్డు ధరకు భూమి అమ్ముడవడం.. ఈ రెండు పరిణామాలు పాన్‌మక్తా భూముల వేలాన్ని రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చాయి.

## సోమవారం నుంచి కొత్త రూల్స్

- సిమ్ కార్డులపై కేంద్రం నిబంధనలు
- తొమ్మిది సిమ్‌లకు మించి ఇక నో




**ముందుగా గుర్తింపు.. తర్వాత పూర్తి నియంత్రణ**

కొత్త విధానంలో భాగంగా వినియోగదారుడి పేరుతో ఇప్పటికే ఉన్న కనెక్షన్లను గుర్తించే వ్యవస్థను టెలికాం కంపెనీలు అమలు చేయాలి. ఆగస్టు 23 నుంచి డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌లో గరిష్ఠ పరిమితికి చేరుకున్న వినియోగదారుల ఫొటోలను అందుబాటులో ఉంచనున్నారు. సంస్థలు ఈ సమాచారాన్ని ప్రతిరోజూ డౌన్‌లోడ్ చేసుకుని కొత్త సిమ్ కోసం వచ్చే వ్యక్తులను గుర్తించాలి. ప్రారంభంలో ఈ తనిఖీ పోస్ట్ ఫ్యాక్టో విధానంలో జరుగుతుంది. అంటే సిమ్ యాక్టివేషన్ తర్వాత కూడా తనిఖీ చేసే అవకాశం ఉంటుంది. పరిమితికి మించి కనెక్షన్ యాక్టివేట్ అయితే సమస్య పరిష్కారమయ్యే వరకు దాన్ని వెంటనే సస్పెండ్ చేయాలని కేంద్రం సూచించింది. కొత్త సిమ్ కోసం దరఖాస్తు చేసే సమయంలో వ్యక్తి పేరుతో ఇప్పటికే ఉన్న కనెక్షన్ల వివరాలను ప్రకటించాల్సి ఉంటుంది.

**నవంబర్ 30 నుంచి రియల్ టైమ్ చెక్**

ప్రస్తుతం అమలులోకి వస్తున్న వ్యవస్థకు తుది రూపం త్వరలో రానుంది. నవంబర్ 30, 2026 నాటికి సిమ్ జారీ చేసే సమయంలోనే రియల్ టైమ్‌లో తనిఖీ చేసే వ్యవస్థను టెలికాం సంస్థలు ఏర్పాటు చేయాలి. అంటే ఒక వ్యక్తి ఇప్పటికే గరిష్ఠ పరిమితికి చేరుకున్నాడా లేదా అన్నది సిమ్ యాక్టివేషన్‌కు ముందే తెలిసిపోతుంది. పరిమితి దాటితే కొత్త కనెక్షన్ ఇవ్వకుండా నేరుగా నిరాకరించాలి. ఈ చర్యల వెనుక అక్రమ కనెక్షన్లు, నకిలీ గుర్తింపులతో తీసుకునే సిమ్‌లు, టెలికాం దుర్వినియోగాన్ని అరికట్టే లక్ష్యం ఉంది. ఇకపై ఒకే వ్యక్తి పేరుతో ఎక్కువ సిమ్‌లు తీసుకునే అవకాశం గణనీయంగా తగ్గనుంది. ఇప్పటికే తమ పేరుతో ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో వినియోగదారులు ఒకసారి పరిశీలించుకోవడం మంచిది.

# ఇథనాల్‌కి షుగర్ ధరలకు లింకేంటి?

- ఈ 20..కేంద్రంపై కాంగ్రెస్ ఫైర్
- పెట్రోల్ పాలసీపై రివ్యూ డిమాండ్
- వాహనం ఖర్చా.. వంటింటి ఖర్చా?

దేశంలో ఈ 20 పెట్రోల్ విధానంపై కాంగ్రెస్ మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేసింది. ఈ 20 విధానాన్ని వెంటనే సమీక్షించాలి, వినియోగదారులకు నాన్‌ఎథనాల్ పెట్రోల్ ఎంపికను అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ ఈ అంశంపై స్పందిస్తూ ప్రజలు రవాణా ఖర్చుతో పాటు ఆహార ధరల రూపంలోనూ భారం మోస్తున్నారని ఆరోపించారు. ఎథనాల్ తయారీ కోసం చెరకు, ఆహార ధాన్యాలను మళ్లించడం వల్ల ఆహార ధరలపై ప్రభావం పడుతోందని ఆయన పేర్కొన్నారు. ఒకవైపు వంటింటి ఖర్చులు పెరుగుతున్నాయి.. మరోవైపు వాహనాల మైలేజీ తగ్గుతోందన్న ఆందోళన ఉంది అని కాంగ్రెస్ వాదిస్తోంది. ముఖ్యంగా ఈ 20కు అనుకూలంగా డిజైన్ చేయని పాత వాహనాల్లో మైలేజీ, ఇంజిన్ అనుకూలతపై సమస్యలు రావచ్చని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

### చెరకు నుంచి ఎథనాల్.. ధరలపై ప్రభావమా?

ఈ 20 విధానం వల్ల చక్కెర ఉత్పత్తికి ఉపయోగించాల్సిన చెరకులో కొంత భాగం ఎథనాల్ తయారీ వైపు మళ్లుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. జైరాం రమేశ్ ప్రస్తావించిన గణాంకాల ప్రకారం సుమారు 25 లక్షల టన్నుల చెరకు చక్కెర తయారీ నుంచి ఎథనాల్ ఉత్పత్తికి మళ్లించారని పేర్కొన్నారు. గత మూడు నెలల్లో చక్కెర ధర కిలో రూ.48 నుంచి రూ.67కు, బెల్లం ధర రూ.50 నుంచి రూ.65కు పెరిగిందని ఆయన తెలిపారు. అయితే ఈ ధరల పెరుగుదలకు ఈ 20 ఒక్కటే కారణమని చెప్పడం సరికాదన్న వాదన కూడా ఉంది. మరోవైపు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా పెట్రోల్ ధరల్లో వినియోగదారులకు తగిన ప్రయోజనం కనిపించడం లేదని కాంగ్రెస్ ప్రశ్నించింది. పెట్రోల్‌లో ఎథనాల్ కలపడం వల్ల ప్రభుత్వానికి ఖర్చు తగ్గితే ఆ ప్రయోజనం వినియోగదారులకు ఎందుకు అందడం లేదని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

### పాత వాహనాలకు ఈ 10 ఇవ్వాలన్న సూచన

ఈ 20పై విమర్శలు పెరుగుతున్న సమయంలో ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ కూడా పాత వాహనాల కోసం ఈ 10 పెట్రోల్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆహారం కోసం ఉపయోగించే పంటలు, ఇంధనం కోసం ఉపయోగించే పంటల మధ్య సమతుల్యత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా ఈ 20 వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల అనుకూలత, వినియోగదారుల ఎంపిక తగ్గడం, పర్యావరణ ప్రభావం వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఇంధన విధానం వల్ల వాహనం ఖర్చు పెరగకూడదు.. వంటింటి ఖర్చు కూడా పెరగకూడదన్నదే కాంగ్రెస్ ప్రధాన వాదన. మరోవైపు ఈ 20 వల్ల కాలుష్య నియంత్రణ, ఇంధన దిగుమతులపై ఆధారపడటం తగ్గడం వంటి ప్రయోజనాలను కేంద్రం ప్రోత్సహిస్తోంది. దీంతో ఇప్పుడు దేశంలో చర్చ కేవలం పెట్రోల్ ధరలపై కాకుండా ఆహారం వర్సెస్ ఇంధనం, వినియోగదారుడి ఎంపిక, వాహనాల అనుకూలత చుట్టూ సాగుతోంది.



# చక్కెర ధరల మంట ఎందుకు?

## . పెరుగుదల వెనుక 5 కారణాలు

చక్కెర ధరలు ఒక్కసారిగా పెరగడంతో అసలు కారణాలపై చర్చ మొదలైంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా చక్కెర ధరలు పెరగడానికి ఐదు ప్రధాన కారణాలు ఉన్నాయని వెల్లడించింది. దేశీయ ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం, పండుగల ముందు డిమాండ్ పెరగడం, వాతావరణం కారణంగా చెరకు పంట దెబ్బతినడం, అంతర్జాతీయ మార్కెట్లో సరఫరా తగ్గడం, కొందరు వ్యాపారుల నిల్వలు, ఊహాగానాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయని కేంద్రం తెలిపింది. ఆగస్టు 20 నాటికి దేశవ్యాప్తంగా చక్కెర రిటైల్ ధర కిలోకు రూ.55.70కు చేరింది. జూలై 20న ఇదే ధర రూ.48.18గా ఉంది. అంటే నెల రోజుల్లో దాదాపు 16 శాతం పెరిగింది. ధరల నియంత్రణ కోసం కేంద్రం 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది.

### ఉత్పత్తి తగ్గింది.. డిమాండ్ పెరిగింది

చక్కెర ధరల పెరుగుదలకు ప్రధాన కారణాల్లో దేశీయ ఉత్పత్తి తగ్గడం ఒకటిగా కేంద్రం పేర్కొంది. ఈ సీజన్‌లో చక్కెర ఉత్పత్తి తొలుత 343 లక్షల టన్నులు ఉంటుందని అంచనా వేయగా, ఇప్పుడు 306 లక్షల టన్నులకు తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది. రెడ్ రాట్, టాప్ బోరర్ వంటి చెరకు వ్యాధులు, అధిక వర్షాలతో నీట మునక పంటకు నష్టం కలిగించాయని వివరించింది. సాధారణంగా భారత్‌లో ఏటా 320340 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి అవుతుండగా, దేశీయ వినియోగం సుమారు 280290 లక్షల టన్నులుగా ఉంది. ఇదే సమయంలో పండుగల సీజన్ దగ్గరపడటంతో డిమాండ్ పెరుగుతోంది. చెరకు నుంచి ఎథనాల్ తయారీ పెరగడం వల్లే చక్కెర ధరలు పెరిగాయన్న వాదనను కేంద్రం తిరస్కరించింది. ఎథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా 2022 23లో సుమారు 12 శాతం ఉండగా, 202526లో 9 శాతానికి తగ్గిందని తెలిపింది. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న ఎథనాల్‌లో దాదాపు 75 శాతం ధాన్యాల నుంచి, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని వివరించింది.



### నిల్వలపై నిఘా.. దిగుమతులతో బ్రేక్

ధరలు మరింత పెరగకుండా కేంద్రం నిల్వలపై కూడా కఠిన చర్యలు తీసుకుంది. ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు చక్కెర డీలర్లు 400 టన్నులకు మించి నిల్వ ఉంచకూడదని పరిమితి విధించింది. సెప్టెంబర్ 1 నుంచి భారీ వినియోగదారులు తమ 15 రోజుల అవసరానికి మించి చక్కెర నిల్వ చేయకూడదు. చక్కెర మిల్లుల్లో నిల్వలను కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందాలు ప్రత్యక్షంగా తనిఖీ చేస్తున్నాయి. అక్టోబర్ 15 నుంచి క్రషింగ్ ప్రారంభించాలని మిల్లులకు సూచించారు. దీని వల్ల అక్టోబర్‌లో సాధారణంగా వచ్చే 34 లక్షల టన్నుల ఉత్పత్తి కంటే 10 లక్షల టన్నులకు పైగా చక్కెర ఉత్పత్తి అవుతుందని కేంద్రం అంచనా వేస్తోంది. మరోవైపు ప్రపంచ చక్కెర మార్కెట్లో కూడా సరఫరా కొరత ఉంది. 2026 27లో ప్రపంచ చక్కెర లోటు సుమారు 33 లక్షల టన్నులుగా అంచనా. అంతర్జాతీయ ధరలు కూడా పెరిగాయి. అందుకే దేశీయ ఉత్పత్తి, పండుగల డిమాండ్, వాతావరణ నష్టం, ప్రపంచ మార్కెట్, నిల్వలపై ఊహాగానాలు.. ఈ ఐదు అంశాలే ప్రస్తుతం చక్కెర ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని కేంద్రం చెబుతోంది.

## చక్కెర ధరలకు కేంద్రం చెక్

### దిగుమతులతో ధరలకు బ్రేక్


దేశంలో చక్కెర ధరలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అక్టోబర్ 31, 2026 వరకు 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. దేశీయ మార్కెట్లో చక్కెర లభ్యత పెంచడం, ధరల పెరుగుదలను నియంత్రించడం ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం చక్కెర ఎక్స్‌మిల్ ధరలు గణనీయంగా పెరిగాయి. ఏడాది క్రితం క్వింటాల్‌కు రూ.3,900గా ఉన్న ధర ఇప్పుడు రూ.5,400 5,500కు చేరింది. రిటైల్ మార్కెట్లో కిలో చక్కెర ధర కూడా ఏడాది కాలంలో సుమారు 13 శాతం పెరిగి రూ.46.34 నుంచి రూ.52.30కు చేరింది. రాబోయే రోజుల్లో గణేష్ చతుర్థి, దసరా, దీపావళి వంటి పండుగల కారణంగా చక్కెరకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉండటంతో కేంద్రం ముందస్తు చర్యలు చేపట్టింది.

### భారీగా నిల్వ చేస్తే ఇక కుదరదు

చక్కెరను మార్కెట్లో కృత్రిమంగా నిల్వ చేసి ధరలు పెంచే అవకాశాలను తగ్గించేందుకు కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నెలకు 10 టన్నులకు పైగా చక్కెర వినియోగించే భారీ వినియోగదారులు 15 రోజుల అవసరానికి మించి నిల్వ ఉంచకూడదని కేంద్రం ఆదేశించింది. ఈ నిబంధన సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. మిఠాయి తయారీదారులు, శీతల పానీయాల సంస్థలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, స్వీటు దుకాణాలు, ఇతర సంస్థాగత కొనుగోలుదారులు ఈ నిబంధన పరిధిలోకి వస్తారు. గత ఏడాది సగటు నెలవారీ వినియోగం కనీసం 10 టన్నులు ఉన్న సంస్థలను బల్క్ వినియోగదారులుగా పరిగణిస్తారు. చక్కెర డీలర్లకు ఇప్పటికే 30 రోజుల వినియోగానికి మించి 4,000 క్వింటాళ్ల నిల్వపై పరిమితి విధించగా, ఇప్పుడు భారీ వినియోగదారులపైనా నియంత్రణ పెంచారు.

### కొత్త సీజన్‌కు ముందే భారీ ప్లాన్

అక్టోబర్ 1 నుంచి ప్రారంభమయ్యే 202627 చక్కెర సీజన్‌కు ముందు దేశీయ నిల్వలపై ఆందోళనలు ఉన్నాయి. కొత్త సీజన్ ప్రారంభ సమయానికి 4042 లక్షల టన్నుల చక్కెర నిల్వ ఉండొచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. కొన్ని అంచనాలు ఈ నిల్వను 3235 లక్షల టన్నులకే పరిమితం చేస్తున్నాయి. ఇదే సమయంలో దేశీయ అవసరం సుమారు 50 లక్షల టన్నులుగా ఉంది. ఈ లోటును దృష్టిలో పెట్టుకుని 10 లక్షల టన్నుల ముడి చక్కెర దిగుమతికి కేంద్రం అవకాశం కల్పించింది. మిల్లర్లు, సొంత రిఫైనింగ్ సామర్థ్యం ఉన్న రిఫైనర్లు ఆగస్టు 21 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ 15లోపు దిగుమతి పూర్తి చేస్తామని హామీ ఇచ్చే సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మొత్తంగా చూస్తే దిగుమతులు, నిల్వ పరిమితులతో చక్కెర ధరలను అదుపులోకి తీసుకురావడమే కేంద్రం తాజా చర్యల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.



## చక్కెర ధరలపై కేజ్రీవాల్ ఫైర్

### . షుగర్ రేట్స్ పెంపుపై ఆప్ దాడి

దేశంలో చక్కెర ధరలు భారీగా పెరగడంపై ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా టార్గెట్ చేసింది. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వ విధానాలే ప్రస్తుత పరిస్థితికి కారణమని ఆరోపించారు. ఎథనాల్ తయారీ కోసం చెరకును మళ్లించడం వల్ల చక్కెర ఉత్పత్తి తగ్గిపోయిందని, ఫలితంగా కేవలం 17 రోజుల్లోనే కిలో చక్కెర ధర రూ.20 పెరిగిందని ఆయన అన్నారు. వీడియో సందేశంలో కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో కిలో చక్కెర రూ.46గా ఉంటే ఇప్పుడు రూ.65కు చేరిందని పేర్కొన్నారు. ఎథనాల్‌ను పెట్రోల్‌లో కలపడం ద్వారా చమురు దిగుమతులపై ఖర్చయ్యే విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని ప్రభుత్వం చెప్పిందని ఆయన గుర్తుచేశారు. అయితే ఇప్పుడు చక్కెర కొరత కారణంగా అదే దేశం దిగుమతుల వైపు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని కేజ్రీవాల్ విమర్శించారు.

### ఎథనాల్ విధానమే కారణమా?

చెరకు ఉత్పత్తిలో కొంత భాగాన్ని ఎథనాల్ తయారీకి మళ్లించడం వల్ల దేశంలో చక్కెర లభ్యత తగ్గిందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఆయన వాదన ప్రకారం చెరకు ఎథనాల్ వైపు మళ్లడంతో చక్కెర ఉత్పత్తి తగ్గి, మార్కెట్లో సరఫరా కొరత ఏర్పడింది. అదే సమయంలో డిమాండ్ కొనసాగడంతో ధరలు వేగంగా పెరిగాయని చెప్పారు. ఎథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందని, కొన్ని వాహనాలపై ప్రభావం పడుతోందని కూడా ఆయన ఆరోపించారు. అంటే ఒకవైపు పెట్రోల్‌లో ఎథనాల్ కలపడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు చెరకు వినియోగం మారడంతో చక్కెర ధరలు పెరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. వాహనదారుడి జేబుపై ఒక భారం.. వంటింటిపై మరో భారం పడుతోందన్నదే ఆప్ ప్రధాన విమర్శగా నిలిచింది.

### ఎగుమతి నుంచి దిగుమతి?

కేజ్రీవాల్ మరో కీలక ప్రశ్నను కేంద్రం ముందు ఉంచారు. ఒకప్పుడు భారత్ చక్కెరను ఇతర దేశాలకు ఎగుమతి చేసేదని, ఇప్పుడు చక్కెరను దిగుమతి చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఎథనాల్ ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయాలని తీసుకున్న నిర్ణయం చివరకు చక్కెర దిగుమతులకు అదే విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేసే పరిస్థితికి దారితీసిందని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉంటే చక్కెర ధరల నియంత్రణ కోసం కేంద్రం ఇప్పటికే 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. భారీగా చక్కెర వినియోగించే సంస్థలకు నిల్వ పరిమితులు కూడా విధించింది. దీంతో ఇప్పుడు E20 ఎథనాల్ విధానం, చక్కెర ధరలు, చెరకు వినియోగం, దిగుమతులపై రాజకీయ చర్చ మరింత వేడెక్కింది. కేంద్రం తీసుకున్న ఇంధన విధానం ప్రజల వాహన ఖర్చుతో పాటు వంటింటి ఖర్చుపైనా ప్రభావం చూపుతోందన్న కేజ్రీవాల్ విమర్శలు రాజకీయంగా కొత్త చర్చకు తెరతీశాయి.

## భారతి కుటుంబానికి న్యాయం కావాలి



- లింగమనేని కుమారుడ్ని అరెస్ట్ చేయండి
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్

రోడ్డు ప్రమాదంలో 26 ఏళ్ల భారతి ముఖి మృతి ఘటనపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ స్పందించారు. జనసేన ఎంపీ లింగమనేని రమేష్ కుమారుడు లింగమనేని సంజుష్‌ను వెంటనే అరెస్ట్ చేసి భారతి కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగి ఐదు రోజులు గడిచినా నిందితుడిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. భారతి కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రూలింగ్ పార్టీలో ఉన్నవారికి ఒక చట్టం, సాధారణ ప్రజలకు మరో చట్టమా? అంటూ కేఏ పాల్ పోలీసు వ్యవస్థను ప్రశ్నించారు. ప్రమాద ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

### లగ్జరీ కారు ఢీకొని యువతి మృతి

మాదాపూర్ ఐటీ కారిడార్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో ఆగస్టు 16న మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. లైఫ్‌స్టైల్ స్టోర్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న భారతి ముఖి రోడ్డు దాటుతుండగా లగ్జరీ స్పోర్ట్స్ కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ప్రమాదానికి లింగమనేని సంజుష్ కారణమని పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.


## గజవాహనంపై వరలక్ష్మీదేవి విహారం

- అగస్త్యేశ్వరాలయంలో వైభవంగా వ్రతాలు

ప్రొద్దుటూరు శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే స్వామివారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం వరలక్ష్మీదేవిని గజవాహనంపై ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. వ్రతం కోసం వచ్చిన ముత్తైదువులు



కలశాలను చేతబట్టి ఆలయ తిరుమాడ వీధుల్లో ప్రదక్షిణలు చేశారు. అనంతరం సుమారు 140 మంది ముత్తైదువులతో సామూహికంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు కుటుంబాలకు సుఖసంతోషాలు, సౌభాగ్యం ప్రసాదించాలని భక్తులు ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారింది. వ్రత కార్యక్రమం అనంతరం ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు ముత్తైదువులకు అమ్మవారి ప్రసాదంతో పాటు గాజులు, శేషవస్త్రం, పసుపు, కుంకుమ, పండ్లు, సౌభాగ్య సామగ్రిని అందజేశారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కూడా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి. రమణ, చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



## హీరో దేవరకొండ కాదు.. దొంగ దేవరకొండ!

- రాజుపాలెం గొర్రెల దొంగల ముఠాకు చెక్

సినిమాల్లో దేవరకొండ పేరు వినగానే హీరో గుర్తొస్తాడు. కానీ ప్రొద్దుటూరు పరిసరాల్లో మాత్రం దేవరకొండ రమేష్ పేరు పోలీసుల రికార్డుల్లో దొంగగా మారింది. గొర్రెల దొంగల ముఠాకు నాయకత్వం వహించిన రమేష్‌ను రాజుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. రాత్రివేళల్లో గొర్రెల షెడ్లను రెక్కీ చేసి, గొర్రెలు, పొట్టేళ్లను వాహనాల్లో తరలించి విక్రయించేవారని పోలీసులు గుర్తించారు. వెంగలాయపల్లెలో 18, రామచంద్రపురంలో 20, గోపవరంలో 13, అరకటవేములలో 3, పోట్లదుర్తిలో 12 జీవాలను దొంగిలించినట్లు దర్యాప్తులో తేలింది. వరుస ఫిర్యాదులతో ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. సీసీటీవీ



ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిఘా పెట్టిన పోలీసులు ఆగస్టు 20న రమేష్‌ను పెట్రోల్ బంకు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.

### లగ్జరీ లైఫ్ వెనుక దొంగతనాల డబ్బు

రమేష్ వద్ద రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఈ కేసులో ఇప్పటివరకు రూ.6.70 లక్షల నగదు, మహీంద్రా కారు, బొలెరో, బజాజ్ పల్సర్ వాహనాలను సీజ్ చేశారు. దొంగతనాల ద్వారా వచ్చిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడిపినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఇప్పటికే ముఠాలోని ఆరుగురిని అరెస్ట్ చేయగా, రమేష్ పట్టుబడటంతో మొత్తం అరెస్టుల సంఖ్య ఏడుకు చేరింది. గతంలోనూ అతడిపై దొంగతనం, దాడులకు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దొంగిలించిన జీవాలను ఎక్కడ విక్రయించేవారు, ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. హీరోలా దర్జాగా తిరిగినా.. చివరకు పోలీసుల చేతికి చిక్కి దొంగగా మిగిలిపోయాడు.

## డాక్టర్ ప్రియాంక హత్య కేసు

### నిందితుల మరో 14 రోజుల రిమాండ్



రాజమహేంద్రవరంలో సంచలనం సృష్టించిన డాక్టర్ ప్రియాంక హత్య కేసులో న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. కేసులో నిందితులుగా ఉన్న సూరవరపు దస్వంత్, జోసెఫ్ ఎడ్వర్డ్స్ పోలీస్ కస్టడీ ముగియడంతో అధికారులు వారిని రాజమహేంద్రవరం జిల్లా కోర్టులో హాజరుపరిచారు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో నిందితుల రిమాండ్‌ను మరో 14 రోజులు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో దర్యాప్తు అధికారులు నిందితులను పలుమార్లు విచారించినట్లు తెలుస్తోంది. హత్యకు సంబంధించిన పలు అంశాలపై సమాచారం సేకరించడంతో పాటు కేసులో కీలక ఆధారాల కోసం వారిని ప్రశ్నించినట్లు సమాచారం. కస్టడీ గడువు పూర్తికావడంతో నిందితులను న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని కట్టుదిట్టమైన భద్రత మధ్య రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

### అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం

డాక్టర్ ప్రియాంక హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేస్తున్నారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల పాత్ర, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పోలీస్ కస్టడీలో సేకరించిన సమాచారాన్ని ఇప్పటికే ఉన్న ఆధారాలతో సరిపోల్చి తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి రావచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. నిందితుల రిమాండ్ మరో 14 రోజులు పొడిగించడంతో విచారణకు మరింత సమయం లభించింది. కేసులో నిజాలు బయటకు రావడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు. దర్యాప్తు పురోగతి, తదుపరి పోలీసు చర్యలపై ప్రస్తుతం తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## కురవి వీరభద్రస్వామి సేవలో 'రాజ్యసంస్కరణ' చీఫ్ ఎడిటర్ వెంకన్న



మహబూబాబాద్, ఆగస్టు 21 (రాజ్యసంస్కరణ ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లాలోని ప్రసిద్ధ కురవి వీరభద్రస్వామి ఆలయంలో 'రాజ్యసంస్కరణ' చీఫ్ ఎడిటర్ గుండెబోయిన వెంకన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. పత్రిక ప్రథమ సంచిక ప్రతులను ఆలయానికి తీసుకెళ్లి స్వామివారి సన్నిధిలో పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రథమ సంచిక ప్రతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వీరభద్రస్వామి ఆశీస్సులు 'రాజ్యసంస్కరణ' పత్రికపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల గొంతుకగా 'రాజ్యసంస్కరణ' దినపత్రిక మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు అభిలషించారు. అనంతరం ఆలయ అర్చకులు చీఫ్ ఎడిటర్ వెంకన్నకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ పూజా కార్యక్రమంలో చీఫ్ రిపోర్టర్ జీ. వెంకటేశ్వర్లు (చిన్నా), జిల్లా రిపోర్టర్ ఎస్కే. జానీ పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో ఎంజి వన్ ఈవీ షోరూం

**ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



షాద్‌నగర్ పట్టణంలో "ఎంజి వన్" ఎలక్ట్రికల్ ఈవీ షోరూం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై షోరూంను ప్రారంభించారు. నిర్వాహకులు అక్కిగారి శ్రీధర్, అక్షయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే స్వయంగా ఎలక్ట్రిక్ స్కూటర్ నడిపి సంతోషం వ్యక్తం చేశారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఎంతో ఉపయోగకరమని చెప్పారు. మోడల్‌ను బట్టి 60 నుంచి 200 కిలోమీటర్ల వరకు రేంజ్ ఉంటుందని పేర్కొన్నారు. స్కూటర్ల కొనుగోలుపై వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, టీవీ, ఏసీ, వాక్యూమ్ క్లీనర్, హోమ్ థియేటర్ వంటి ఆకర్షణీయ బహుమతులు అందిస్తున్నట్లు వెల్లడించారు. అందుబాటు ధరల్లో ఆధునిక ఈవీలను అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



## బంగారు వరలక్ష్మి కానుక-4 గ్రాండ్ సక్సెస్

మహిళల్లో హైందవ చైతన్యం పెంపొందించాలనే సంకల్పంతో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాసరావు నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక సీజన్ 4 ఘన విజయం సాధించింది. రాజానగరంలోని మాధవి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి ముగింపు కార్యక్రమం జరిగింది. చివరి రోజు లక్కీడ్రాలో ఎంపికైన 220 మంది మహిళలకు బంగారు రూపులు, పట్టు చీరలు, పసుపు కుంకుమను కంబాల దంపతులు అందించారు. మరో 3,500 మంది మహిళలకు పట్టు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమాల ద్వారా లక్ష పట్టు చీరలు పంపిణీ చేసినట్లు కంబాల శ్రీనివాసరావు తెలిపారు.

## నేడు కేరళకు పవన్ కళ్యాణ్

**భుజం చికిత్స కోసం థెరపీ**

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం కేరళకు వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆయనకు తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు.



5లో..

## భారతి కుటుంబానికి న్యాయం కావాలి

**లింగమనేని కుమారుడ్ని అరెస్ట్ చేయండి**

**ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్**

రోడ్డు ప్రమాదంలో 26 ఏళ్ల భారతి ముఖి మృతి ఘటనపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ స్పందించారు. జనసేన ఎంపీ లింగమనేని రమేష్ కుమారుడు లింగమనేని సంజుష్‌ను వెంటనే అరెస్ట్ చేసి భారతి కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు.



3లో..

# తమిళనాడులో కార్‌చిచ్చు



వివరాలు5లో..

తమిళనాడు రాజకీయాల్లో ఎమ్మెల్యేల కార్ల వ్యవహారం మంట రాజేస్తోంది. 234 మంది ఎమ్మెల్యేలకు ప్రభుత్వ కారు, నెలకు రూ.75 వేల వాహన భత్యం, మరో రూ.25 వేల సహాయకుడి ఖర్చు ఇవ్వాలన్న సీఎం విజయ్ నిర్ణయంపై డీఎంకే షాక్ ఇచ్చింది. 59 మంది డీఎంకే ఎమ్మెల్యేలు ప్రభుత్వ కార్లు తీసుకోబోమని ఉదయనిధి స్టాలిన్ ప్రకటించారు. అవసరమున్న వారికి మాత్రమే వాహనాలు ఇవ్వాలని, ఎమ్మెల్యేల ఆస్తులు, ఇప్పటికే ఉన్న కార్ల ఆధారంగా అర్హత నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం ప్రజలను కలవడానికి ఎమ్మెల్యేలకు వాహనం అవసరమేనని చెబుతోంది. కానీ అసలు ప్రశ్న ఖజానాపైనే పడుతోంది. వాహన భత్యాలకే ఏడాదికి రూ.28.08 కోట్ల భారం పడనుండగా, కార్ల కొనుగోలు, ఇంధనం, డ్రైవర్లు, నిర్వహణ ఖర్చులు అదనం. ఖజానా కష్టాల్లో ఉందని చెబుతున్న వేళ ఎమ్మెల్యేల కోసం ఇంత ఖర్చు అవసరమా అంటూ ప్రతిపక్షం ప్రశ్నిస్తోంది. దీంతో కారు ఎవరికోసం.. ఖర్చు ఎవరి కోసం? అన్న చర్చ తమిళనాడు రాజకీయాల్లో హాట్ హాట్‌గా మారింది.

## ఖజానాకు షాక్! తమిళనాడు సర్కార్ నిర్ణయంపై రగడ

తమిళనాడు రాజకీయాల్లో ఇప్పుడు ఎమ్మెల్యేల కార్ల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని 234 మంది ఎమ్మెల్యేలకు ప్రభుత్వ వాహనం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి ఎమ్మెల్యేకు కారు మాత్రమే కాదు.. నెలకు రూ.75 వేల వాహన భత్యం కూడా ఇవ్వనున్నారు. ఇందులో ఇంధనం, వాహన నిర్వహణ, డ్రైవర్ ఖర్చులు ఉంటాయి. అదనంగా కార్యాలయ సహాయకుడి కోసం నెలకు రూ.25 వేలు కేటాయిస్తారు. అంటే ఒక్క ఎమ్మెల్యేకు నెలకు మొత్తం రూ.లక్ష వరకు అదనపు సౌకర్యం అందుతుంది. ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలి, ప్రజలను కలవాలి, ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించాలి అన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

## ఎమ్మెల్యేలకు కార్లు వద్దంటూ డీఎంకే షాక్

**ప్రభుత్వ కార్లపై తమిళనాడులో కొత్త చర్చ**

**59 మంది డీఎంకే నేతల సంచలన నిర్ణయం**

తమిళనాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రభుత్వ కార్ల అంశం రాజకీయ చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి విజయ్ ఇటీవల ప్రతి ఎమ్మెల్యేకు ప్రభుత్వ కారు, నెలకు రూ.75 వేల నిర్వహణ, ఇంధన ఖర్చులు, మరో రూ.25 వేలతో సహాయకుడిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీనిపై డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అసెంబ్లీలో మాట్లాడుతూ 59 మంది డీఎంకే ఎమ్మెల్యేలు ప్రభుత్వ కార్లను తీసుకోకూడదని నిర్ణయించుకున్నారని ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేలందరూ సంతకాలు చేసిన లేఖను స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి అందించారు.

# టార్గెట్ హోం మినిస్టర్

**• పెల్లెట్ కేసుతో ప్రభుత్వానికి షాక్ • ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఎటాక్**

**• ఎఫ్ఐఆర్‌తో అమిత్ షాకు కౌంటర్ • ఆరు గంటల పాటు రాహుల్ ధర్నా**



ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దూకుడు రాజకీయానికి తెరతీశారు. జూలై 20న జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలో పెల్లెట్ గాయాలతో బాధపడుతున్న 19 ఏళ్ల సహిల్ లోచబ్‌కు న్యాయం చేయాలంటూ ఆయన శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆరు గంటలకు పైగా ధర్నాకు దిగారు. ముందుగా సహిల్‌తో కలిసి మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు.

(వివరాలు 2లో..)



7లో..

# ఢిల్లీపై తిరగబడ్డ తమిళబిడ్డ

- బీజేపీని ఢీకొట్టి.. తమిళబాట పట్టిన అన్నామలై
- ఐపీఎస్ నుంచి రాజకీయ తుఫానుగా చరిత్ర
- సింగంలా పేరు తెచ్చుకున్న ఐపీఎస్ అధికారి

ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన అన్నామలై.. బీజేపీలో చేరి తమిళనాడులో పార్టీకి కొత్త ఊపిరి పోశారు. దూకుడు, డీఎంకేపై విరుచుకుపడే శైలి, 1,700 కిలోమీటర్ల పాదయాత్రతో బీజేపీ ఓటు శాతాన్ని 3 శాతం నుంచి 11 శాతానికి తీసుకెళ్లిన నాయకుడు.. చివరకు అదే పార్టీకి గుడ్‌బై ఎందుకు చెప్పాల్సి వచ్చింది? ఇది కేవలం పదవి పోయిన కథ కాదు.. పొత్తుపై వచ్చిన విభేదం కాదు.. ఢిల్లీ నిర్ణయాలకు తమిళనాడు నాయకత్వం ఎదురుతిరిగిన కథ. అన్నామలైకి కావాల్సింది తమిళనాడులో బీజేపీ స్వతంత్ర ఎదుగుదల. పార్టీ పెద్దలకు కావాల్సింది డీఎంకేను ఓడించేందుకు అన్నాడీఎంకేతో బలమైన కూటమి. ఈ రెండు వ్యూహాలు ఢీకొన్న చోటే అసలు చీలిక మొదలైంది. ఆ తర్వాత రాష్ట్ర పార్టీ నిర్ణయాలు ఢిల్లీలో తీసుకోవడం, గుజరాత్‌కే జాతీయ ప్రాజెక్టుల్లో అధిక ప్రాధాన్యం దక్కుతోందన్న ఆయన ఆరోపణలు, మేకెదాటు నుంచి మూడు భాషల విధానం వరకు కేంద్ర నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించడం.. అన్నామలైలోని బీజేపీ నాయకుడిని క్రమంగా తమిళనాడు ప్రయోజనాల కోసం మాట్లాడే స్వతంత్ర రాజకీయవేత్తగా మార్చాయి. అందుకే ఆయన నిష్క్రమణను సాధారణ రాజీనామాగా చూడలేం. బీజేపీని వదిలిన అన్నామలై.. ఇప్పుడు బీజేపీకి బయట నుంచే తమిళనాడు రాజకీయాల్లో కొత్త పరీక్ష పెడుతున్నారు. అసలు ప్రశ్న ఒక్కటే.. అన్నామలై బీజేపీ నుంచి బయటకు వచ్చారా? లేక బీజేపీ రాజకీయ ప్రయోగం నుంచే బయటపడ్డారా?



## సాదిక్ ఖాన్ దొరికాడు!

- ఐదు రోజుల వేటకు తెర
- ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు

కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రైఫిల్ షూటింగ్ కోచ్ షేక్ సాధిక్ ఖాన్ ఢిల్లీలో పోలీసులకు చిక్కినట్లు సమాచారం. నూకరాజు కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన తర్వాత సాధిక్ పరారయ్యాడు. (వివరాలు 5లో..)



## డాక్టర్ ప్రియాంక హత్య కేసు

**నిందితుల మరో 14 రోజుల రిమాండ్**

రాజమహేంద్రవరంలో సంచలనం సృష్టించిన డాక్టర్ ప్రియాంక హత్య కేసులో న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. కేసులో నిందితులుగా ఉన్న సూరవరపు దస్వంత్, జోసెఫ్ ఎడ్వర్డ్స్ పోలీస్ కస్టడీ ముగియడంతో అధికారులు వారిని రాజమహేంద్రవరం జిల్లా కోర్టులో హాజరుపరిచారు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో నిందితుల రిమాండ్‌ను మరో 14 రోజులు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో దర్యాప్తు అధికారులు నిందితులను పలుమార్లు విచారించినట్లు తెలుస్తోంది.

(వివరాలు 5లో..)



## మోదీ చాలీసా.. ఢిల్లీలో కొత్త రాజకీయ చర్చ

- ప్రెస్‌క్లబ్ వద్ద వైరల్ రచ్చ

ఢిల్లీలోని ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీని శ్రీరాముడి రూపంలో చూపిస్తూ 'మోదీ చాలీసా' పేరుతో ఓ ప్రచార పత్రం కనిపించింది. సాధారణంగా భక్తి సంప్రదాయంలో వినిపించే హనుమాన్ చాలీసా తరహాలో మోదీ పేరుతో రూపొందించిన ఈ ప్రచారం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. మోదీని శ్రీరాముడి వేషధారణలో చూపించడం ఈ ప్రచారానికి ప్రత్యేక ఆకర్షణగా మారింది. (వివరాలు 5లో..)



## హైదరాబాద్‌లో పెళ్లి వేడుకకు జగన్

**వధూవరులను ఆశీర్వదించిన మాజీ సీఎం**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించారు. బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు అభిమానులు, యువత ఘన స్వాగతం పలికారు. యువత భారీగా వెంట నడవడంతో విమానాశ్రయం నుంచి నగరంలో ఆయన పర్యటన ప్రత్యేక ఆకర్షణగా మారింది. అనంతరం హైదరాబాద్‌లోని జలవిహార్ గ్రాండ్ లాన్స్‌లో జరిగిన వివాహ వేడుకకు జగన్ హాజరయ్యారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడు అనంత పినాక్ శర్మ వివాహం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వివాహ వేడుకలో పాల్గొన్న జగన్ నూతన వధూవరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో నూతన వధూవరులు స్నిగ్ధ, అనంత పినాక్ శర్మలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడిన జగన్ నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు.




## రాయలసీమ అభివృద్ధి ఎలా?

- సీమ నీటి హక్కులపై వైసీపీ పోరు

రాయలసీమకు చంద్రబాబు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి సాకే శైలజానాథ్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గ్రేటర్ రాయలసీమ టాస్క్‌ఫోర్స్, రైతు, యువజన, విద్యార్థి విభాగాల సమావేశం తర్వాత ఆయన మాట్లాడారు. శ్రీశైలం జలాశయంలో దాదాపు 180 టీఎంసీలకు పైగా నీరు ఉన్నా రాయలసీమ రిజర్వాయర్లు సగం కూడా నిండలేదని ప్రశ్నించారు. (5లో..)

## ఉయ్యూరులో డయేరియా కలకలం

**మంత్రి పర్యటన తర్వాత కొత్త వివాదం**



ఉయ్యూరులో డయేరియా పరిస్థితిపై మంత్రి నారాయణ పర్యటన రాజకీయంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి డయేరియాపై అసత్య ప్రచారం జరుగుతోందని మండిపడ్డారు. ఆస్పత్రిలో ప్రస్తుతం తొమ్మిది మంది చికిత్స పొందుతున్నారని, ఉయ్యూరు పరిసర గ్రామాలతో కలిపి మొత్తం 11 మంది డయేరియాతో ఆస్పత్రిలో చేరారని తెలిపారు.

(వివరాలు 5లో..)

# కడప ఎంపీ అవినాష్ ఇంట్లో ఈడీ సోదాలు

**రూ.24 లక్షలు సీజ్ చేసిన అధికారులు**



వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు కలకలం రేపాయి. హైదరాబాద్, కడపలోని ఏడు ప్రాంతాల్లో పీఎంఎల్ఏ కింద ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో అవినాష్‌రెడ్డి నివాసం నుంచి లెక్క చూపని రూ.24 లక్షల నగదుతో పాటు రెండు బ్యాంక్ లాకర్ల తాళాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారికంగా వెల్లడించింది. నేరానికి సంబంధించినట్లు భావిస్తున్న కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను కూడా సీజ్ చేసినట్లు తెలిపింది. వివేకా హత్యకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తులో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు ఈడీ స్పష్టం చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్, మూడు చార్జ్‌షీట్ల ఆధారంగా మనీలాండరింగ్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించింది. దీంతో సుదీర్ఘకాలంగా రాజకీయ, న్యాయపరమైన చర్చకు కేంద్రంగా ఉన్న వివేకా హత్య కేసు మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## డైవర్షన్ కోసమే మరోసారి

**ఈడీ సోదాలపై వైసీపీ ఫైర్**




వివేకానందరెడ్డి హత్య కేసును మరోసారి తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ డైవర్షన్ ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన డీఎస్పీ అక్రమాలు, పోలీసుల కారులో గంజాయి, అధికార పార్టీ ఎంపీ కుమారుడి ర్యాష్ డ్రైవింగ్‌లో యువతి మృతి, సుగాలి ప్రీతి తల్లి వీల్‌చైర్ యాత్రను అడ్డుకోవడం వంటి అంశాలపై ప్రజల్లో చర్చ జరుగుతున్న సమయంలోనే ఈడీ సోదాలు తెరపైకి వచ్చాయని అన్నారు. (వివరాలు 5లో..)



# సాదిక్ ఖాన్ దొరికాడు!

- ఐదు రోజుల వేటకు తెర
- ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు

కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రైఫిల్ షూటింగ్ కోచ్ షేక్ సాధిక్ ఖాన్ ఢిల్లీలో పోలీసులకు చిక్కినట్లు సమాచారం. నూకరాజు కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన తర్వాత సాధిక్ పరారయ్యాడు. అతడిని పట్టుకునేందుకు పది మంది ఎస్ఐలు సహా సుమారు 40 మంది పోలీసులు ప్రత్యేక బృందాలుగా గాలింపు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ముంబై, ఢిల్లీ ప్రాంతాల్లో వెతికిన పోలీసులు చివరకు పక్కా సమాచారంతో ఢిల్లీలో తనిఖీలు నిర్వహించి సాధిక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతడిని కాకినాడకు తరలించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం. ఆదివారం నాటికి నిందితుడిని కాకినాడకు తీసుకురావచ్చని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### సూసైడ్ నోట్‌లో సంచలన ఆరోపణలు

నూకరాజు, ఆయన భార్య, కుమార్తె ఈ నెల 16న రాజమహేంద్రవరం సమీపంలో గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనకు ముందు రాసిన సూసైడ్ నోట్‌లో సాధిక్ వేధింపులే తమ దుస్థితికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు పోలీసులు చెబుతున్నారు. నూకరాజు కుటుంబంతో పరిచయం పెంచుకున్న సాధిక్ క్రమంగా వారిపై ప్రభావం చూపాడని ఆరోపణలు ఉన్నాయి. కుమార్తె సౌజన్యను లోబరుచుకునేందుకు ప్రయత్నించడం, ప్రైవేట్ ఫొటోలతో బెదిరించడం, ఆస్తుల కోసం ఒత్తిడి చేయడం, మతం మార్చుకోవాలని ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. సౌజన్య భర్త జగదీశ్వర్‌రెడ్డి మరణం కూడా ఈ వ్యవహారంలో కీలకంగా మారింది. ఆయనకు విషపూరిత పదార్థం ఇచ్చి చంపాడని సౌజన్య రాసిన లేఖలో ఆరోపించినట్లు సమాచారం. ఈ ఆరోపణలపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. నూకరాజు, సౌజన్య మృతదేహాలు లభించగా, ఆయన భార్య మీనా మృతదేహం కోసం గాలింపు కొనసాగుతోంది. మనవడు మాత్రం ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డాడు.

### సాధిక్ అరెస్ట్‌తో అసలు మిస్టరీపై దృష్టి

జగదీశ్వర్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు ఆధారంగా సర్పవరం పోలీసులు సాధిక్‌పై హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు విషయం తెలియగానే అతడు మొబైల్ ఫోన్‌ను వదిలేసి పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పుడు సాధిక్ పట్టుబడటంతో నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన పరిణామాలు, జగదీశ్వర్‌రెడ్డి మృతి వెనుక ఉన్న అసలు కారణాలు, ఆస్తుల వ్యవహారం, బ్లాక్‌మెయిల్ ఆరోపణలపై విచారణ మరింత కీలకంగా మారనుంది. షూటింగ్ అకాడమీకి వచ్చే యువతులు, బాలికలతో అనుచితంగా ప్రవర్తించేవాడనే ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు సాధిక్ గత వ్యవహారాలపై ఆరా తీయనున్నారు. అయితే ఆరోపణలు నిజమా కాదా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఐదు రోజుల గాలింపు తర్వాత నిందితుడు చిక్కడంతో కేసులో కీలక ఆధారాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఏర్పడింది.

# ఉయ్యూరులో డయేరియా కలకలం

- మంత్రి పర్యటన తర్వాత కొత్త వివాదం



ఉయ్యూరులో డయేరియా పరిస్థితిపై మంత్రి నారాయణ పర్యటన రాజకీయంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి డయేరియాపై అసత్య ప్రచారం జరుగుతోందని మండిపడ్డారు. ఆస్పత్రిలో ప్రస్తుతం తొమ్మిది మంది చికిత్స పొందుతున్నారని, ఉయ్యూరు పరిసర గ్రామాలతో కలిపి మొత్తం 11 మంది డయేరియాతో ఆస్పత్రిలో చేరారని తెలిపారు. అయితే వీరిలో ఆరుగురు మాత్రమే ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధికి చెందినవారని చెప్పారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని స్పష్టం చేశారు. ఆగస్టు 17న ఒక వ్యక్తి గుండెపోటుతో మృతి చెందారని, ఆ మరణానికి డయేరియాతో ఎలాంటి సంబంధం లేదని మంత్రి తేల్చిచెప్పారు. మరోవైపు తాగునీటి పైపులైన్ కాలుష్యమా, ఆర్వో ప్లాంట్ల సమస్యా అన్నది పరిశీలించాల్సి ఉందన్నారు. ప్రాథమిక పరీక్షల్లో నీటిలో బ్యాక్టీరియా గుర్తించలేదని తెలిపారు. ఉయ్యూరులో పాత పైపులైన్ల మార్పునకు అమృత్ 2.0 కింద రూ.98 కోట్లతో పనులు చేపడుతున్నట్లు ప్రకటించారు.

### నీటి సమస్యపై బాధ్యత ఎవరిది?

మంత్రి వ్యాఖ్యలపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తాయి. డయేరియా కేసులు ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్న సమయంలోనే వ్యాప్తికి అసలు కారణం ఏమిటన్నది ఇంకా తేలకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆర్వో ప్లాంట్ల నుంచి నీరు తాగడం వల్ల కూడా సమస్య వచ్చి ఉండొచ్చన్న మంత్రి వ్యాఖ్యలు బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నంగా ప్రతిపక్షాలు, స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, తాగునీటి సరఫరా, పైపులైన్ల పరిస్థితిపై సమగ్రంగా దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. డయేరియాతో సంబంధం లేదని మంత్రి చెబుతున్న మరణంపైనా పూర్తిస్థాయి స్పష్టత రావాల్సి ఉందని అంటున్నారు. ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు నీటి కాలుష్యానికి కారణం ఏదో శాస్త్రీయంగా నిర్ధారించి, వెంటనే శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఉయ్యూరు ఘటనలో అసలు నిజం తేల్చడమే ఇప్పుడు ప్రధాన అంశంగా మారింది.

# రాయలసీమ అభివృద్ధి ఎలా?

- సీమ నీటి హక్కులపై వైసీపీ పోరు




రాయలసీమకు చంద్రబాబు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి సాకే శైలజానాథ్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గ్రేటర్ రాయలసీమ టాస్క్‌ఫోర్స్, రైతు, యువజన, విద్యార్థి విభాగాల సమావేశం తర్వాత ఆయన మాట్లాడారు. శ్రీశైలం జలాశయంలో దాదాపు 180 టీఎంసీలకు పైగా నీరు ఉన్నా రాయలసీమ రిజర్వాయర్లు సగం కూడా నిండలేదని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 40,400 క్యూసెక్కుల సామర్థ్యం ఉంటే కేవలం 8 వేల క్యూసెక్కుల నీటినే విడుదల చేస్తున్నారని విమర్శించారు. వెలుగోడు, బ్రహ్మం సాగర్, సోమశిల, కండలేరు, గోరకల్లు, గండికోట, చిత్రావతి వంటి ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నీరు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. రైతుల నీటి హక్కులను కాపాడేందుకు ఈ నెల 24న పోతిరెడ్డిపాడు వద్ద భారీ ప్రజా పోరాటం చేపడతామని ప్రకటించారు.

### లిఫ్ట్ ఇరిగేషన్ రద్దుపైనా విమర్శలు

రాయలసీమకు నీటి భద్రత కల్పించే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రభుత్వం నిలిపివేసిందని శైలజానాథ్ ఆరోపించారు. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచే పనులను రద్దు చేసి సామర్థ్యాన్ని తగ్గించారని విమర్శించారు. సీమ ప్రాజెక్టులకు నీరు అందకుండా అడ్డుకుంటున్న నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు, అప్పర్ భద్ర ప్రాజెక్టు వంటి అంశాలపై కేంద్రంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు, మాల్యాల, ముచ్చుమర్రి మార్గాల ద్వారా పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేసి రాయలసీమ రిజర్వాయర్లను నింపాలని కోరారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే రాయలసీమ వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని శైలజానాథ్ హెచ్చరించారు.

Ayudam Daily

# టార్గెట్ హోం మినిస్టర్

- పెల్లెట్ కేసుతో ప్రభుత్వానికి షాక్
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఎటాక్
- ఎఫ్ఐఆర్‌తో అమిత్ షాకు కౌంటర్
- ఆరు గంటల పాటు రాహుల్ ధర్నా




ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దూకుడు రాజకీయానికి తెరతీశారు. జూలై 20న జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలో పెల్లెట్ గాయాలతో బాధపడుతున్న 19 ఏళ్ల సహిల్ లోచబ్‌కు న్యాయం చేయాలంటూ ఆయన శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆరు గంటలకు పైగా ధర్నాకు దిగారు. ముందుగా సహిల్‌తో కలిసి మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. అక్కడ స్పందన రాకపోవడంతో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని డీసీపీని కలిశారు. ఎఫ్ఐఆర్ నమోదు అయ్యే వరకు కదిలేది లేదంటూ రాహుల్ అక్కడే బైఠాయించడం ఢిల్లీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. చివరకు ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేయడంతో ధర్నాను విరమించారు.

### ఎఫ్ఐఆర్‌తో కొత్త రాజకీయ అస్త్రం

పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 118(1) కింద కేసు నమోదు చేశారు. ప్రమాదకరమైన ఆయుధం లేదా మార్గం ద్వారా ఉద్దేశపూర్వకంగా గాయపరిచిన అంశానికి ఈ సెక్షన్ వర్తిస్తుంది. సహిల్ ఫిర్యాదులో తన శరీరంలో 200కుపైగా పెల్లెట్లు ఉన్నాయని, కంటికి తీవ్ర గాయం కావడంతో చూపు తిరిగి వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉందని పేర్కొన్నాడు. ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే రాహుల్ దీనిని “న్యాయం వైపు మొదటి అడుగు”గా అభివర్ణించారు. నెల రోజులుగా బాధితుడు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా కేసు నమోదు కాలేదని ఆరోపించారు. మరోవైపు రాహుల్ నేరుగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ప్రశ్నలు సంధించారు. పైస్థాయి అనుమతి వచ్చిన తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదైందని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అసలు రాజకీయ పోరును అమిత్ షా వైపు మళ్లించాయి.

### అమిత్ షాపై నేరుగా గురి

పెల్లెట్ గన్స్ వినియోగంపై అమిత్ షా వివరణ ఇవ్వాలని రాహుల్ డిమాండ్ చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పలేదని కూడా ఆయన విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కూడా ఇదే అంశాన్ని రాజకీయంగా ముందుకు తీసుకెళ్తున్నారు. కేసు నమోదుతో పెల్లెట్ వినియోగంపై దర్యాప్తుకు అధికారిక మార్గం ఏర్పడిందని కాంగ్రెస్ చెబుతోంది. అయితే బీజేపీ మాత్రం రాహుల్ ధర్నాను “అటెన్షన్ సీకింగ్ పాలిటిక్స్”గా అభివర్ణించింది. సుప్రీంకోర్టు ఇప్పటికే జూలై 20 ఘటనపై ఐదుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని బీజేపీ నేతలు గుర్తుచేస్తున్నారు. అయినా రాహుల్ వెనక్కి తగ్గలేదు. బాధితుడి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించడం ద్వారా రాజకీయంగా ఒక అడుగు ముందుకేశారు. ఇప్పుడు ఎఫ్ఐఆర్ దర్యాప్తు ఎటు వెళ్తుంది? పెల్లెట్ గన్స్ ఎవరి ఆదేశాలతో వాడారు? ఈ ప్రశ్నలే కేంద్ర ప్రభుత్వంపై కొత్త ఒత్తిడిగా మారే అవకాశం కనిపిస్తోంది.

# నేడు కేరళకు పవన్ కళ్యాణ్

- భుజం చికిత్స కోసం థెరపీ



జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం కేరళకు వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆయనకు తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. శస్త్రచికిత్స తర్వాత వైద్యులు పూర్తిస్థాయి విశ్రాంతి సూచించినా, పాలనా బాధ్యతల నేపథ్యంలో పవన్ వారం రోజుల్లోనే క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు. అనంతరం ముందుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలు నిర్వహించారు. దీంతో శస్త్రచికిత్స చేసిన కుడి భుజంపై మళ్లీ ఒత్తిడి పెరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో భుజం ప్రాంతంలో వాపు పెరగడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు వెల్లడించాయి.

### చికిత్సతో పాటు పాలన

ప్రస్తుతం భుజం పూర్తిగా కోలుకునేలా వైద్యుల సూచనలను పాటించాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించుకున్నట్లు జనసేన కేంద్ర కార్యాలయం తెలిపింది. కేరళలోని ఆయుర్వేద వైద్యాలయంలో ప్రత్యేక థెరపీ తీసుకోవడం ద్వారా శస్త్రచికిత్స అనంతర సమస్యలను తగ్గించుకోవడంపై ఆయన దృష్టి పెట్టనున్నారు. వైద్యుల సూచన మేరకు చికిత్స, విశ్రాంతికి ప్రాధాన్యం ఇస్తూనే పాలనా బాధ్యతలను కొనసాగించాలని పవన్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు కొంతకాలం బహిరంగ కార్యక్రమాలు, అధికారిక విధులకు దూరంగా ఉండాలని సూచించినప్పటికీ, ప్రభుత్వ బాధ్యతల కారణంగా ఆయన వరుస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇప్పుడు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టాలని నిర్ణయించుకున్నారు. పూర్తిస్థాయిలో కోలుకున్న తర్వాతే సాధారణ కార్యక్రమాల్లో పాల్గొనేలా వైద్యుల సలహా మేరకు తదుపరి చర్యలు ఉంటాయని జనసేన వర్గాలు వెల్లడించాయి.

# ఎమ్మెల్యేలకు కార్లు వద్దంటూ డీఎంకే షాక్

- ప్రభుత్వ కార్లపై తమిళనాడులో కొత్త చర్చ
- 59 మంది డీఎంకే నేతల సంచలన నిర్ణయం





తమిళనాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రభుత్వ కార్ల అంశం రాజకీయ చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి విజయ్ ఇటీవల ప్రతి ఎమ్మెల్యేకు ప్రభుత్వ కారు, నెలకు రూ.75 వేల నిర్వహణ, ఇంధన ఖర్చులు, మరో రూ.25 వేలతో సహాయకుడిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీనిపై డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అసెంబ్లీలో మాట్లాడుతూ 59 మంది డీఎంకే ఎమ్మెల్యేలు ప్రభుత్వ కార్లను తీసుకోకూడదని నిర్ణయించుకున్నారని ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేలందరూ సంతకాలు చేసిన లేఖను స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి అందించారు. రాష్ట్ర ఖజానా ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని ప్రభుత్వం చెబుతున్న సమయంలో ప్రజాధనం నుంచి ఎమ్మెల్యేలందరికీ కార్లు ఇవ్వడం అవసరమా అన్నదే డీఎంకే ప్రధాన ప్రశ్నగా నిలిచింది.

### అవసరమున్న వారికే కార్లు ఇవ్వాలి

తమిళనాడు ఎమ్మెల్యేలందరికీ ప్రభుత్వ కార్లు ఇవ్వాలన్న నిర్ణయంపై రాజకీయ వేడి పెరిగింది. అందరికీ కాకుండా అవసరమున్న ఎమ్మెల్యేలకే కార్లు ఇవ్వాలని ఉదయనిధి స్టాలిన్ సూచించారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లలోని ఆస్తులు, ఇప్పటికే ఉన్న వాహనాలను పరిశీలించి అర్హత నిర్ణయించాలని అన్నారు. ప్రభుత్వ కార్లను తమ ఎమ్మెల్యేలు తీసుకోకూడదని 59 మంది డీఎంకే ఎమ్మెల్యేలు నిర్ణయించినట్లు తెలిపారు. అయితే మంత్రి ఆదవ్ అర్జున్ దీనికి భిన్నంగా స్పందించారు. కొందరు కొత్త ఎమ్మెల్యేలకు సొంత వాహనాలు లేవని, ఒక వీసీకే ఎమ్మెల్యే అసెంబ్లీకి బస్సులో వస్తున్నారని ఉదాహరణ ఇచ్చారు. ఎమ్మెల్యేలకు కారు విలాసం కాదు.. ప్రజలను కలవడానికి అవసరమైన సౌకర్యం అని మంత్రి వాదించారు. సీపీఐ ఎమ్మెల్యే కూడా అవసరమున్న వారికే వాహనాలు ఇవ్వాలని సూచించారు. మరోవైపు ఉదయనిధి ఇది రాజకీయ డ్రామా కాదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకునే తమ నిర్ణయమని స్పష్టం చేశారు. దీంతో ప్రజాసేవకు కార్లు అవసరమా? లేక ఖజానాపై భారం

# ఎమ్మెల్యేలకు కార్లు.. ఖజానాకు షాక్!

- తమిళనాడు సర్కార్ నిర్ణయంపై రగడ

తమిళనాడు రాజకీయాల్లో ఇప్పుడు ఎమ్మెల్యేల కార్ల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని 234 మంది ఎమ్మెల్యేలకు ప్రభుత్వ వాహనం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి ఎమ్మెల్యేకు కారు మాత్రమే కాదు.. నెలకు రూ.75 వేల వాహన భత్యం కూడా ఇవ్వనున్నారు. ఇందులో ఇంధనం, వాహన నిర్వహణ, డ్రైవర్ ఖర్చులు ఉంటాయి. అదనంగా కార్యాలయ సహాయకుడి కోసం నెలకు రూ.25 వేలు కేటాయిస్తారు. అంటే ఒక్క ఎమ్మెల్యేకు నెలకు మొత్తం రూ.లక్ష వరకు అదనపు సౌకర్యం అందుతుంది. ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలి, ప్రజలను కలవాలి, ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించాలి అన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

### ఏటా రూ.28 కోట్లకు పైగా భారం


అసలు లెక్కలు చూస్తే మాత్రం ఈ నిర్ణయం ప్రభుత్వ ఖజానాపై పెద్ద భారంగా మారే అవకాశం కనిపిస్తోంది. 234 మంది ఎమ్మెల్యేలకు నెలకు రూ.75 వేల వాహన భత్యం అంటే ఏడాదికి రూ.21.06 కోట్లు. సహాయకుడి కోసం ఇచ్చే రూ.25 వేలతో మరో రూ.7.02 కోట్లు ఖర్చవుతాయి. అంటే వాహనాలు కొనకముందే రెండు భత్యాల రూపంలో ప్రభుత్వంపై ఏడాదికి రూ.28.08 కోట్ల పునరావృత భారం పడుతుంది. ఐదేళ్ల అసెంబ్లీ కాలాన్ని లెక్కలోకి తీసుకుంటే ఈ రెండు భత్యాలకే రూ.140 కోట్లకు పైగా ఖర్చవుతుంది. దీనికి 234 వాహనాల కొనుగోలు, బీమా, సర్వీసింగ్, టైర్లు, మరమ్మతులు, డ్రైవర్ల ఖర్చులు కలిస్తే మొత్తం వ్యయం మరింత పెరగడం ఖాయం. ఖజానా లోటు ఉందని చెబుతున్న ప్రభుత్వం ఎమ్మెల్యేల కోసం ఇంత భారీ ప్యాకేజీ ఎందుకు ప్రకటించిందన్న ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.

# డీఎస్సీపై సీబీఐ దర్యాప్తు జరపాలి

**స్పోర్ట్స్ కోటాపై అనుమానాలు తొలగించాలి**

**మాజీ ఎమ్మెల్యే రాచమల్లు డిమాండ్**

డీఎస్సీ నియామకాలపై వస్తున్న అక్రమాల ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రొద్దుటూరులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటాలో 372 మందికి పరీక్ష లేకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని అన్నారు. సాధారణంగా పరీక్షల అనంతరం రిజర్వేషన్లు, కోటా నిబంధనలు అమలు చేస్తారని, స్పోర్ట్స్ కోటా నియామకాల కోసం ప్రత్యేక జీవోలు తీసుకురావడంపై సమగ్ర విచారణ అవసరమని పేర్కొన్నారు. డీఎస్సీ అభ్యర్థులు, వైసీపీ నేతలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. డీఎస్సీ వ్యవహారంపై పూర్తిస్థాయి సీబీఐ దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు బయటపడతాయని రాచమల్లు అన్నారు. సీఎం, విద్యాశాఖ మంత్రి డీఎస్సీ అభ్యర్థులతో బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు.





# మోదీ చాలీసా..

- ఢిల్లీలో కొత్త రాజకీయ చర్చ
- ప్రెస్‌క్లబ్ వద్ద వైరల్ రచ్చ

ఢిల్లీలోని ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీని శ్రీరాముడి రూపంలో చూపిస్తూ ‘మోదీ చాలీసా’ పేరుతో ఓ ప్రచార పత్రం కనిపించింది. సాధారణంగా భక్తి సంప్రదాయంలో వినిపించే హనుమాన్ చాలీసా తరహాలో మోదీ పేరుతో రూపొందించిన ఈ ప్రచారం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. మోదీని శ్రీరాముడి వేషధారణలో చూపించడం ఈ ప్రచారానికి ప్రత్యేక ఆకర్షణగా మారింది. అయితే ఈ ‘మోదీ చాలీసా’ ఎవరు రూపొందించారు, దాని వెనుక ఉద్దేశం ఏమిటన్న దానిపై స్పష్టమైన అధికారిక సమాచారం అందుబాటులో లేవు. ప్రధాని వ్యక్తిత్వాన్ని భక్తి ప్రతీకలతో ముడిపెట్టే ఈ తరహా ప్రచారం రాజకీయాల్లో వ్యక్తిపూజపై మరోసారి చర్చకు తెరతీసింది.

### భక్తి.. రాజకీయాల మేళవింపుపై చర్చ

హనుమాన్ చాలీసా వంటి ఆధ్యాత్మిక రచనలను రాజకీయ నేతల పేర్లతో అనుసంధానించడం కొత్త తరహా రాజకీయ ప్రచారంగా కనిపిస్తోంది. మోదీని రాముడి రూపంలో చూపిస్తూ ‘మోదీ చాలీసా’ రూపొందించడం రాజకీయ అభిమానం ఏ స్థాయికి చేరిందనే ప్రశ్నలను లేవనెత్తుతోంది. కొందరు దీనిని అభిమానుల సృజనాత్మకతగా చూస్తుండగా, మరికొందరు రాజకీయ నాయకులను దేవతా ప్రతిరూపాలతో పోల్చడం సమాజంలో వ్యక్తిపూజను పెంచుతుందని విమర్శిస్తున్నారు. ప్రెస్‌క్లబ్ పరిసరాల్లో ఇది కనిపించడంతో రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి ఏర్పడింది. భక్తి, రాజకీయ అభిమానం మధ్య గీత ఎక్కడ ఉండాలన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఈ ప్రచారానికి సంబంధించిన పూర్తి వివరాలు, దాని వెనుక ఉన్న వ్యక్తులు లేదా సంస్థలపై స్పష్టత రావాల్సి ఉంది.

# డైవర్షన్ కోసమే మరోసారి

- ఈడీ సోదాలపై వైసీపీ ఫైర్

వివేకానందరెడ్డి హత్య కేసును మరోసారి తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ డైవర్షన్ ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన డీఎస్సీ అక్రమాలు, పోలీసుల కారులో గంజాయి, అధికార పార్టీ ఎంపీ కుమారుడి ర్యాష్ డ్రైవింగ్‌లో యువతి మృతి, సుగాలి ప్రీతి తల్లి వీల్‌చైర్ యాత్రను అడ్డుకోవడం వంటి అంశాలపై ప్రజల్లో చర్చ జరుగుతున్న సమయంలోనే ఈడీ సోదాలు తెరపైకి వచ్చాయని అన్నారు. అవినాష్‌రెడ్డి ఇంట్లో ఈడీ తొలిసారి సోదాలు చేయడాన్ని ఏదో భారీ విజయం సాధించినట్లు ఎల్లో మీడియా ప్రచారం చేస్తోందని విమర్శించారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే వివేకా హత్య కేసును మళ్లీ రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు.

### ట్రయల్ జరగనివ్వండి.. నిజం తేల్చండి

వివేకా హత్య కేసులో ఇప్పటికే సిట్, సీబీఐ దర్యాప్తులు జరిగాయని శ్రీకాంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ట్రయల్ సజావుగా జరిగితే అసలు నిజాలు బయటకు వస్తాయని అన్నారు. విచారణను ఎందుకు ఆలస్యం చేస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వివేకాను హత్య చేసిన గొడ్డలి ఎవరిదో తేలాల్సిందేనని స్పష్టం చేశారు. సుగాలి ప్రీతి కేసు, వివేకా హత్య కేసులో నిజాయితీగా దర్యాప్తు జరగాలని కోరారు. తప్పుడు ప్రచారాలు, డైవర్షన్ రాజకీయాలు మానుకుని వ్యవస్థలను పనిచేయనివ్వాలని సూచించారు. వివేకానందరెడ్డి హత్యను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం కాకుండా, కేసు ట్రయల్ పూర్తి చేసి నిజాన్ని ప్రజల ముందుకు తీసుకురావడమే అసలు లక్ష్యం కావాలని గడికోట శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.





# లగ్జరీ కారు బీభత్సం.. యువతి మృతి

- ఇనార్బిట్ మాల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- కారు నడిపిన ఎంపీ లింగమనేని తనయుడు

హైదరాబాద్ మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో ఆగస్టు 16న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 26 ఏళ్ల భారతి ముఖి మృతి చెందారు. ఆమె అదే మాల్‌లోని లైఫ్‌స్టైల్ స్టోర్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. భోజనం తీసుకుని సహోద్యోగితో కలిసి తిరిగి మాల్‌కు వస్తుండగా రోడ్డు దాటే సమయంలో ఆస్టన్ మార్టిన్ కారు ఆమెను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో భారతి తీవ్రంగా గాయపడి, తలకు బలమైన దెబ్బ తగలడంతో భారీగా రక్తస్రావమైంది. వెంటనే అదే కారులో ఆమెను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసుల దర్యాప్తులో ఆ సమయంలో కారు నడిపింది ఏపీ రాజ్యసభ ఎంపీ, జనసేన నేత లింగమనేని రమేష్ కుమారుడు లింగమనేని సంజుష్‌గా గుర్తించారు. కారు అతి వేగం, నిర్లక్ష్యంగా నడిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

### అరెస్టుపై ప్రశ్నలు.. న్యాయం కోరుతూ డిమాండ్లు

ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన ఆస్టన్ మార్టిన్ కారును స్వాధీనం చేసుకున్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని ఇప్పటివరకు అరెస్టు చేయకుండా నోటీసు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేరం బెయిలబుల్ కావడంతో అరెస్టు చేయలేదని పోలీసులు చెబుతున్నారు.



# ఆమె చేసిన నేరమేంటి..?

- 27 కత్తిపోట్లకు కారణమేంటి?
- హత్య తర్వాత కూడా వెంటాడుతున్న ప్రశ్నలు

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఒక మహిళ దారుణంగా హత్యకు గురైంది. ఒక ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయింది. ఒక విద్యాసంస్థ బాధ్యతలు మోస్తున్న ప్రిన్సిపాల్ ఇక లేరు. విద్యార్థుల భవిష్యత్తు కోసం క్రమశిక్షణను అమలు చేయాల్సిన వ్యక్తి జీవితమే హింసకు బలైంది. కానీ ఈ ఘటన తర్వాత సమాజం ముందున్న అసలు ప్రశ్న హంతకులు ఎవరు? ఎందుకు చంపారు? అనే దానికే పరిమితం కావడం లేదు. ఆమె చేసిన నేరమేంటి? 27 కత్తిపోట్లు పడేంతటి తప్పు ఆమె ఏం చేసింది? ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపడానికి ఏ కారణం ఉన్నా అది చట్టబద్ధమైన సమర్థన కాదు. ఒక మహిళ మరణించిన వెంటనే ఆమె వ్యక్తిగత జీవితం, వ్యక్తిత్వం, కుటుంబ సంబంధాలు, భర్తతో ఉన్న అనుబంధం వంటి అంశాల చుట్టూ అనుమానాలు తిరగడం మరొక నైతిక సమస్యను తెరపైకి తెస్తోంది. హత్యకు గురైన వ్యక్తి తనపై వచ్చే ఆరోపణలకు సమాధానం చెప్పుకోలేడు. ఆమె ఇక తనను తాను సమర్థించుకోలేరు. అలాంటి సమయంలో ఆమె గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత బతికున్న సమాజంపైనే ఉంటుంది. హత్యను పరిశోధించాలి. హంతకుడిని వెతకాలి. ఆధారాలను పరిశీలించాలి. నిజాన్ని బయటకు తీయాలి. కానీ బాధితురాలి వ్యక్తిత్వాన్ని ప్రజా న్యాయస్థానంలో నిలబెట్టి తీర్పు చెప్పడం మాత్రం మరో అన్యాయంగా మారకూడదు.




**• ప్రిన్సిపాల్‌గా బాధ్యత నిర్వర్తించడమే నేరమా?**

ఒక పాఠశాల ప్రిన్సిపాల్ అంటే కేవలం కార్యాలయంలో కూర్చునే అధికారి కాదు. పాఠశాలలో క్రమశిక్షణ ఉండేలా చూడాలి. విద్యార్థుల చదువుపై దృష్టి పెట్టాలి. తప్పు చేస్తున్న పిల్లలను ప్రశ్నించాలి. వారి ప్రవర్తనలో మార్పు రావడానికి అవసరమైనప్పుడు మందలించాలి. తల్లిదండ్రులతో మాట్లాడాలి. విద్యార్థి భవిష్యత్తు దెబ్బతినకుండా ముందుగానే హెచ్చరించాలి. ఈ బాధ్యతలన్నీ ఒక విద్యాసంస్థలో పనిచేసే గురువుకు సహజమైనవే. పిల్లలు తప్పుదోవ పట్టకుండా చూడటం నేరం కాదు. చదువుపై శ్రద్ధ పెట్టమని చెప్పడం నేరం కాదు. క్రమశిక్షణ పాటించమని హెచ్చరించడం నేరం కాదు. విద్యార్థి భవిష్యత్తు కోసం కఠినంగా మాట్లాడటం నేరం కాదు. మరి ఒక గురువు తన బాధ్యత నిర్వర్తించినందుకు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తే విద్యారంగం ఏ సందేశం తీసుకోవాలి? రేపు మరో ప్రిన్సిపాల్ ఒక విద్యార్థి తప్పును గమనిస్తే ప్రశ్నించాలా? లేక సమస్య ఎందుకు తెచ్చుకోవాలని మౌనంగా ఉండాలా? ఒక ఉపాధ్యాయుడు తన విద్యార్థి జీవితాన్ని కాపాడేందుకు కఠినంగా మాట్లాడితే దాని ప్రతిఫలం ప్రాణభయంగా మారితే గురువు పాత్రకు అర్థమేంటి? ఇదే కొండమల్లేపల్లి ఘటన సమాజం ముందుంచిన అత్యంత తీవ్రమైన ప్రశ్న.

**• హంతకుడి కన్నా మృతురాలి క్యారెక్టరే ఎందుకు?**

హత్య జరిగిన వెంటనే అనుమానాలు రావడం సహజం. పోలీసులు కుటుంబ సభ్యులను ప్రశ్నించవచ్చు. పరిచయస్తుల గురించి తెలుసుకోవచ్చు. గత పరిణామాలను పరిశీలించవచ్చు. ఫోన్ కాల్స్, సందేశాలు, సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాలు పరిశీలించవచ్చు. ఎవరికైనా హత్యకు ప్రేరణ ఉందా అనే కోణంలో దర్యాప్తు చేయవచ్చు. దర్యాప్తులో అన్ని కోణాలను పరిశీలించడం పోలీసుల బాధ్యత. కానీ దర్యాప్తులోని అనుమానాన్ని ప్రజల ముందు తీర్పుగా మార్చడం మాత్రం వేరే విషయం. కొన్ని మీడియా కథనాల్లో హత్య వెనుక అసలు నిజం పూర్తిగా బయటపడకముందే బాధితురాలి వ్యక్తిగత జీవితంపై సందేహాలు లేవనెత్తడం, భర్త చుట్టూ ఊహాగానాలు నడపడం, కుటుంబ సంబంధాలను సంచలనంగా చూపించడం వంటి ధోరణులు కనిపిస్తే వాటిపై ప్రశ్నలు రావడం సహజమే. మీడియాకు నిజాన్ని వెతికే హక్కు ఉంది. ప్రశ్నించే హక్కు ఉంది. పోలీసుల దర్యాప్తులో లోపాలను బయటపెట్టే బాధ్యత ఉంది. కానీ ఆధారం లేని అనుమానాన్ని వార్తగా మార్చే హక్కు ఎవరికీ లేదు. ఊహను నిజంలా చూపించడం వార్త కాదు. అనుమానాన్ని తీర్పుగా మార్చడం జర్నలిజం కాదు. బాధితురాలి వ్యక్తిత్వాన్ని సంచలనానికి ఉపయోగించడం ప్రజాస్వామ్య మీడియా విలువలకు తగినది కాదు.

**• కుటుంబం ఒకసారి కోల్పోయింది.. రెండోసారి ఎందుకు?**

ఒక కుటుంబంలో మనిషి చనిపోతే ఆ కుటుంబం ఎదుర్కొనే బాధను మాటల్లో చెప్పడం కష్టం. అకస్మాత్తుగా జరిగిన హత్య అయితే ఆ విషాదం మరింత తీవ్రంగా ఉంటుంది. ఒక వైపు ప్రాణం కోల్పోయిన వ్యక్తి జ్ఞాపకాలు వెంటాడుతుంటాయి. మరోవైపు కేసు దర్యాప్తు జరుగుతుంది. బంధువులు పోలీసుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. అంత్యక్రియల బాధ మధ్య కూడా న్యాయం కోసం ఎదురుచూడాలి. అలాంటి సమయంలో కుటుంబ సభ్యుల వ్యక్తిగత జీవితాన్ని ప్రజా చర్చగా మార్చడం వారి బాధను మరింత పెంచుతుంది. ఒక మనిషిని కోల్పోయిన కుటుంబం మొదట దుఃఖాన్ని అనుభవిస్తుంది. తర్వాత అనుమానాలను ఎదుర్కొంటుంది. చివరికి సమాజపు తీర్పులను కూడా భరించాల్సి వస్తే అది రెండో శిక్షగా మారుతుంది. ఒకసారి ప్రసారమైన ఆరోపణ తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవచ్చు. మరుసటి రోజు మరో వార్తతో దాన్ని కప్పిపుచ్చవచ్చు. కానీ ఒక మహిళ వ్యక్తిత్వంపై ప్రజల మనసుల్లో పడిన మచ్చను పూర్తిగా తొలగించడం చాలా కష్టం. ముఖ్యంగా ఆమె చనిపోయిన తర్వాత తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పే అవకాశం ఆమెకు లేదు. అందుకే మరణించిన వ్యక్తి గురించి మాట్లాడేటప్పుడు మీడియా మాత్రమే కాదు, సోషల్ మీడియాలో స్పందించే ప్రతి ఒక్కరూ కూడా బాధ్యతతో వ్యవహరించాలి.

**• మీడియాకు స్వేచ్ఛ ఉంది.. బాధ్యత కూడా ఉంది!**

జర్నలిజం అంటే అధికారాన్ని ప్రశ్నించడం. పోలీసుల దర్యాప్తును పరిశీలించడం. నిజం దాచిపెడితే వెలుగులోకి తీసుకురావడం. బాధితులకు న్యాయం జరిగేలా వ్యవస్థను ప్రశ్నించడం. ప్రజలకు తెలియాల్సిన సమాచారాన్ని అందించడం. ఇవన్నీ మీడియా బాధ్యతల్లో భాగం. కానీ సంచలనం కోసం ఒక బాధితురాలి గౌరవాన్ని పణంగా పెట్టడం జర్నలిజం స్వేచ్ఛ కాదు. హత్య కేసులో నిజమైన నిందితుడు ఎవరో నిర్ధారించకముందే ఒక కుటుంబాన్ని అనుమానాల మధ్య నిలబెట్టడం ప్రజలకు ఆసక్తి కలిగించవచ్చు. కానీ ఆ ఆసక్తి నిజాన్ని ప్రతిబింబిస్తుందా అనే ప్రశ్న ముందుండాలి. ఒక వార్తను ప్రసారం చేసే ముందు దానికి ఆధారం ఏమిటి? అది ప్రజా ప్రయోజనానికి సంబంధించినదేనా? బాధితురాలి గౌరవాన్ని అనవసరంగా దెబ్బతీస్తుందా? కుటుంబంపై దాని ప్రభావం ఏమిటి? అనే ప్రశ్నలు ఉండాలి. కెమెరా ముందు పలికిన అనుమానం కొన్ని నిమిషాల్లో మరిచిపోవచ్చు. కానీ బాధితురాలి కుటుంబం మాత్రం దాని భారాన్ని సంవత్సరాల పాటు మోసే పరిస్థితి రావచ్చు.

**• ప్రజాసంఘాల గొంతులు ఎందుకు మూగబోయాయి?**

ఈ ఘటన మరో సామాజిక ప్రశ్నను కూడా లేవనెత్తుతోంది. మహిళలపై దాడి జరిగితే స్పందించే సంఘాలు ఉన్నాయి. ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడే సంఘాలు ఉన్నాయి. పౌరహక్కుల వేదికలు ఉన్నాయి. అన్యాయంపై గొంతెత్తే ప్రజా సంఘాలు ఉన్నాయి. మరి ఒక మహిళా ప్రిన్సిపాల్ ఇంత దారుణంగా హత్యకు గురైనప్పుడు ఆ స్థాయిలో సామాజిక స్పందన ఎందుకు కనిపించలేదు? ఒక మహిళా ఉపాధ్యాయురాలి ప్రాణానికి కూడా సమాజం గట్టిగా స్పందించాలి. ఆమె కోసం న్యాయం కోరాలి. ఉపాధ్యాయుల భద్రతపై చర్చ జరగాలి. విద్యాసంస్థల్లో క్రమశిక్షణ అమలు చేసే వారికి రక్షణ కల్పించే విధానాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. కొవ్వొత్తుల ప్రదర్శన ఒక ప్రతీక మాత్రమే. అసలు అవసరం వ్యవస్థను ప్రశ్నించడం. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు, కుటుంబ పర్యవేక్షణ లోపాలు, మత్తు పదార్థాల ప్రభావం, హింసాత్మక కంటెంట్, సోషల్ మీడియా ప్రభావం, పాఠశాలల్లో కౌన్సెలింగ్ వ్యవస్థ, ఉపాధ్యాయుల భద్రత వంటి అంశాలపై సమాజం మాట్లాడాలి. బాధితురాలి నేపథ్యాన్ని బట్టి స్పందన తీవ్రత మారకూడదు. న్యాయం ఎవరికైనా ఒకేలా ఉండాలి.

**• ఎంపిక చేసుకున్న ఆగ్రహం ప్రమాదకరం**

మన సమాజంలో కొన్ని ఘటనలకు వెంటనే భారీ స్పందన వస్తుంది. మరికొన్ని ఘటనలు కొన్ని గంటల్లోనే మరుగునపడతాయి. దీనికి కారణం బాధితుడు ఎవరు, నిందితుడు ఎవరు, వారి సామాజిక నేపథ్యం ఏమిటి, ఘటనకు ఎంత రాజకీయ ప్రాధాన్యం ఉంది అనే అంశాల ప్రభావం కావచ్చు. కానీ న్యాయాన్ని ఇలాంటి ప్రమాణాలతో కొలవడం ప్రమాదకరం. హత్యకు గురైన వ్యక్తికి ముందుగా ఉన్న గుర్తింపు ఆమె ఒక మనిషి అన్నదే. ఆ తర్వాత ఆమె ఒక మహిళ. ఆ తర్వాత ఆమె ఒక ఉపాధ్యాయురాలు. మిగిలిన గుర్తింపులన్నీ ఆ తర్వాతే. ఆమెను ఇష్టపడని వారు ఉండవచ్చు. ఆమె నిర్ణయాలతో విభేదించిన వారు ఉండవచ్చు. ఆమె కఠినంగా మాట్లాడిందని ఎవరైనా భావించి ఉండవచ్చు. ఇవేవీ ఆమెను హత్య చేయడానికి అనుమతి ఇవ్వవు. ఎవరైనా తప్పు చేసినా దానికి చట్టపరమైన మార్గం ఉంది. ఫిర్యాదు చేయవచ్చు. అధికారులను ఆశ్రయించవచ్చు. కోర్టును ఆశ్రయించవచ్చు. కానీ కత్తితో ప్రాణం తీసే హక్కు ఎవరికీ లేదు.

**• ఒక గురువు గొంతు భయంతో మూగపోకూడదు**

కొండమల్లేపల్లి ఘటనను కేవలం ఒక క్రైమ్ కేసుగా చూసి ముగిస్తే అసలు సమస్యను మనం తప్పించుకున్నట్టే. ఒక ఉపాధ్యాయుడు విద్యార్థిని ప్రశ్నించడానికి భయపడే పరిస్థితి ఏర్పడితే విద్యా వ్యవస్థకు అది పెద్ద దెబ్బ. "పిల్లాడిని మందలిస్తే సమస్య వస్తుంది" అనే భయం గురువు మనసులో మొదలైతే తరగతి గదిలో క్రమశిక్షణ బలహీనపడుతుంది. విద్యార్థి తప్పు చేస్తున్నప్పుడు గురువు చెప్పే ఒక్క మాట అతని భవిష్యత్తును మార్చవచ్చు. ఒక హెచ్చరిక చెడు అలవాటును ఆపవచ్చు. ఒక మందలింపు జీవితాన్ని సరైన దారిలో పెట్టవచ్చు. ఒక ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితంపై చూపించే శ్రద్ధను కేవలం ఉద్యోగ బాధ్యతగా చూడకూడదు. అది సమాజ భవిష్యత్తుపై పెట్టుబడి. అలాంటి బాధ్యతను నిర్వర్తించే గురువుకు భద్రత లేకపోతే రేపటి తరగతి గదుల్లో ఏమి మిగులుతుంది? పాఠం చెప్పి వెళ్లిపోయే యంత్రాలా ఉపాధ్యాయులు మారిపోతే పిల్లల వ్యక్తిత్వ వికాసం ఎవరి బాధ్యత అవుతుంది? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది విద్యాశాఖ మాత్రమే కాదు. కుటుంబం, సమాజం, ప్రభుత్వం, మీడియా, ప్రజాసంఘాలు అందరూ చెప్పాలి.

**• రూపారెడ్డి మరణం ఇచ్చిన అసలు హెచ్చరిక**

రూపారెడ్డి హత్య వెనుక నిజమైన కారణం ఏమిటో దర్యాప్తు తేల్చాలి. నిందితులు ఎవరైనా చట్టం ముందు నిలబడాలి. ఆధారాలు కోర్టులో నిరూపితమైతే చట్ట ప్రకారం శిక్ష పడాలి. కానీ ఆ ప్రక్రియతో సమాజం బాధ్యత ముగియదు. ఒక ఉపాధ్యాయురాలి మరణం మరో ఉపాధ్యాయుడిలో భయాన్ని పెంచకూడదు. ఒక ప్రిన్సిపాల్‌పై జరిగిన దాడి కారణంగా రేపటి ప్రిన్సిపాల్ విద్యార్థిని ప్రశ్నించకుండా వెనక్కి తగ్గకూడదు. పాఠశాలల్లో కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. ఉపాధ్యాయులకు అవసరమైన భద్రత కల్పించాలి. విద్యార్థుల్లో హింసాత్మక ప్రవర్తన కనిపిస్తే కుటుంబం, పాఠశాల కలిసి స్పందించాలి. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న హింసాత్మక ప్రభావాలపై పిల్లలకు అవగాహన కల్పించాలి. మత్తు పదార్థాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యాసంస్థల్లో ఫిర్యాదు వ్యవస్థలు పనిచేయాలి. గురువు తన బాధ్యత నిర్వర్తించడానికి భయపడని వాతావరణం ఏర్పడాలి. అదే ఈ ఘటన నుంచి తీసుకోవాల్సిన ప్రధాన పాఠం.

**• ఆమె చేసిన నేరమేంటి..?**

చివరికి మిగిలే ప్రశ్న ఒక్కటే. ఆమె చేసిన నేరమేంటి? విద్యార్థులు బాగుపడాలని కోరడమా? పాఠశాలలో క్రమశిక్షణ ఉండాలని చూడడమా? పిల్లలు తప్పుదోవ పట్టకూడదని హెచ్చరించడమా? తన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించడమా? వీటిలో ఏదైనా నేరమైతే సమాజం తన నిర్వచనాలను మార్చుకోవాలి. లేకపోతే ఒక ఉపాధ్యాయురాలిని చంపిన హింసను మాత్రమే కాదు, ఆమె చనిపోయిన తర్వాత ఆమె వ్యక్తిత్వాన్ని ప్రశ్నించిన నిర్లక్ష్యాన్ని కూడా మనం ప్రశ్నించాలి. హత్యకు గురైన మహిళను విచారణ చేయడం కన్నా హత్య చేసిన వ్యక్తిని విచారణ చేయాలి. బాధితురాలి క్యారెక్టర్‌పై సందేహాలు వెతకడం కన్నా నేరానికి కారణాలను వెతకాలి. కుటుంబాన్ని అనుమానాల బోనులో నిలబెట్టడం కన్నా న్యాయం కోసం వ్యవస్థను ప్రశ్నించాలి.

- **రమేష్ బాబు కాంచనపల్లి**
**సీనియర్ జర్నలిస్ట్**

### బతికున్న గురువుకే భరోసా!

రూపారెడ్డికి ఇప్పుడు సమాధానాలు అవసరం లేదు. ఆమెకు ఈ సమాజపు మాటలు వినిపించవు. కానీ ఆమె మరణం తర్వాత మనం వేసే ప్రతి ప్రశ్న రేపటి ఉపాధ్యాయుడికి ఉపయోగపడాలి. రేపు తరగతి గదిలోకి వెళ్లే గురువు "విద్యార్థిని ప్రశ్నిస్తే నాకు ప్రమాదమేమైనా వస్తుందా?" అని భయపడకూడదు. "తప్పు కనిపిస్తే ప్రశ్నించు. విద్యార్థి భవిష్యత్తు కోసం మాట్లాడి తీరాలి. నీ వెనుక సమాజం ఉంది" అనే భరోసా ప్రతి గురువుకు ఉండాలి. అదే నిజమైన నివాళి. ఒక కుటుంబం కోల్పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేం. జరిగిన హత్యను చెరిపేయలేం. కానీ మరో గురువు భయంతో మౌనంగా మారకుండా చూడగలం. మరో కుటుంబం ఇలాంటి విషాదాన్ని చూడకుండా చర్యలు తీసుకోవచ్చు. మీడియా తన భాషను జాగ్రత్తగా ఎంచుకోవచ్చు. ప్రజాసంఘాలు తమ గొంతును వినిపించవచ్చు. ప్రభుత్వం ఉపాధ్యాయుల భద్రతకు చర్యలు తీసుకోవచ్చు. సమాజం బాధితురాలి గౌరవాన్ని కాపాడవచ్చు. రూపారెడ్డికి నిజమైన నివాళి ఆమె మరణంపై సంచలనం కాదు. ఆమె లాంటి మరో గురువు భయపడకుండా పిల్లల భవిష్యత్తు కోసం నిలబడగల సమాజాన్ని నిర్మించడమే. ఆమె చేసిన నేరమేంటి అన్న ప్రశ్నకు మన సమాధానం స్పష్టంగా ఉండాలి . పిల్లల భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించడం నేరం కాదు. గురువుగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించడం నేరం కాదు. దానికి ప్రాణం పోయే సమాజం మాత్రం తప్పకుండా తనను తాను ప్రశ్నించుకోవాలి.

### ఇంకా చాలా ఉంది!

**ఆమె చేసిన నేరమేంటి..?**

కొండమల్లేపల్లిలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం క్రమశిక్షణ నేర్పడం, తప్పులను ప్రశ్నించడం, తన బాధ్యతను నిర్వర్తించడం ఆమె నేరమా? 27 కత్తిపోట్లు పడేంతటి తప్పు ఆమె ఏం చేసింది? హత్యకు గురైన మహిళను ప్రశ్నించడం కాదు.. ఆమెను హత్య చేసిన కారణాలను సమాజం ప్రశ్నించాలి.

**హత్యపై దర్యాప్తా.. క్యారెక్టర్‌పై విచారణా?**

హత్య కేసులో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేయడం సహజం. కానీ ఆధారాలు పూర్తిగా బయటకు రాకముందే మృతురాలి వ్యక్తిగత జీవితం, వ్యక్తిత్వం, భర్త చుట్టూ అనుమానాలను మీడియా కథనాలుగా మార్చడం బాధ్యతాయుతమైన జర్నలిజమా? అనుమానం వార్త కావచ్చు.. కానీ ఊహను నిజంలా చూపించడం మాత్రం ప్రమాదకరం.

**కుటుంబాన్ని రెండోసారి శిక్షించొద్దు**

ఒక మనిషిని కోల్పోయిన కుటుంబం ఇప్పటికే తీవ్ర విషాదంలో ఉంటుంది. అలాంటి సమయంలో కుటుంబ సభ్యులను ప్రజల ముందు అనుమానాల బోనులో నిలబెట్టడం వారి బాధను మరింత పెంచుతుంది. ఒకసారి ప్రసారమైన ఆరోపణ వెనక్కి తీసుకున్నా, వ్యక్తిత్వంపై పడిన మచ్చ అంత సులభంగా తొలగదు. మృతురాలు తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితిని గుర్తుంచుకోవాలి.

**గురువు భయపడే పరిస్థితి రాకూడదు**

ఒక ప్రిన్సిపాల్ విద్యార్థిని ప్రశ్నించకపోతే ఎవరు ప్రశ్నిస్తారు? తప్పు చేస్తే మందలించకపోతే గురువు బాధ్యతకు అర్థమేంటి? రూపారెడ్డి హత్య తర్వాత మరో ఉపాధ్యాయుడు విద్యార్థిని ప్రశ్నించడానికి భయపడితే అది విద్యా వ్యవస్థకు ప్రమాదకరం. గురువు క్రమశిక్షణ కోసం మాట్లాడినప్పుడు అతని వెంట పాఠశాల, కుటుంబం, సమాజం నిలబడే భద్రతా వ్యవస్థ అవసరం.

**వాట్ నెక్స్ట్..? సమాజం ఏం చేయాలి?**

హత్యకు అసలు కారణాన్ని పోలీసులు ఆధారాలతో తేల్చాలి. నిందితులు ఎవరైనా చట్టం ముందు నిలబెట్టాలి. మీడియా అనుమానాలను సంచలనంగా మార్చకుండా బాధ్యతతో వ్యవహరించాలి. మహిళా, ఉపాధ్యాయ సంఘాలు స్పందించాలి. పాఠశాలల్లో కౌన్సెలింగ్, భద్రతా వ్యవస్థలు బలోపేతం కావాలి. రూపారెడ్డికి నిజమైన నివాళి మరో గురువు భయపడకుండా తన బాధ్యత నిర్వర్తించే సమాజాన్ని నిర్మించడమే.



## • వాట్ నెక్స్ట్..? సమాజం ఏం చేయాలి?

రూపారెడ్డి హత్యపై ఇప్పుడు అసలు వాట్ నెక్స్ట్..? అన్న ప్రశ్న ముందుకు రావాలి. హంతకులు ఎవరు, హత్యకు అసలు కారణం ఏమిటి, కుట్ర వెనుక ఎవరున్నారు అన్నది పోలీసులు ఆధారాలతో తేల్చాలి. నిందితులపై ఆరోపణలు నిరూపితమైతే చట్టం ప్రకారం కఠిన శిక్ష పడాలి. అదే సమయంలో మీడియా కూడా తన బాధ్యతను గుర్తించాలి. అనుమానాన్ని వార్తగా, ఊహను నిజంగా, బాధితురాలి వ్యక్తిగత జీవితాన్ని సంచలనంగా మార్చకుండా జాగ్రత్త పడాలి. రూపారెడ్డి వ్యక్తిత్వాన్ని విచారించడం కాదు.. ఆమెకు జరిగిన అన్యాయంపై సమాజం ప్రశ్నించాలి. ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు స్పందించాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల భద్రతపై స్పష్టమైన వ్యవస్థ ఉండాలి. విద్యార్థుల ప్రవర్తనలో హింసాత్మక ధోరణులు కనిపిస్తే కౌన్సెలింగ్, కుటుంబ పర్యవేక్షణ, అవసరమైనప్పుడు కఠిన చర్యలు ఉండాలి. ఒక గురువు విద్యార్థిని ప్రశ్నించడానికి భయపడే పరిస్థితి రాకూడదు. రూపారెడ్డి మరణం మరో ఉపాధ్యాయుడిని మౌనంగా మార్చకూడదు. ఆమెకు నిజమైన నివాళి కొవ్వొత్తులు వెలిగించడం మాత్రమే కాదు.. బతికున్న ప్రతి గురువుకు "నువ్వు నీ బాధ్యత నిర్వర్తించు.. నీ వెంట సమాజం ఉంది" అనే భరోసా ఇవ్వడం. చివరికి ఈ ఘటన మనకు మిగిల్చే ప్రశ్న ఒక్కటే  హత్యకు గురైన మహిళను ఎందుకు విచారిస్తున్నాం? ఆమెను చంపిన వారిని ఎప్పుడు విచారిస్తాం?



# ఢిల్లీపై తిరగబడ్డ తమిళ బిడ్డ

- బీజేపీని ఢీకొట్టి.. తమిళబాట పట్టిన అన్నామలై
- ఐపీఎస్ నుంచి రాజకీయ తుఫానుగా చరిత్ర
- సింగంలా పేరు తెచ్చుకున్న ఐపీఎస్ అధికారి

**కర్ణాటకలో ఐపీఎస్ అధికారిగా పనిచేసిన కె. అన్నామలై పేరు తొలిసారి రాజకీయాలకు బయటే బలంగా వినిపించింది. కఠినంగా వ్యవహరించే పోలీస్ అధికారిగా, సమస్యలపై నేరుగా స్పందించే వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. పోలీస్ ఉద్యోగంలో ఉండగానే సాధారణ ప్రజలతో మమేకమయ్యే తీరు, అవినీతిపై కఠిన వైఖరి, నేరస్తులపై దూకుడుగా వ్యవహరించే శైలి ఆయనకు "సింగం" అనే ఇమేజ్ తీసుకొచ్చాయి. అధికార పదవి తనకు సరిపోదని భావించిన అన్నామలై 2019లో ఐపీఎస్‌కు రాజీనామా చేశారు. అప్పట్లోనే ఆయన రాజకీయాల్లోకి వస్తారనే చర్చ మొదలైంది. చివరకు 2020 ఆగస్టులో భారతీయ జనతా పార్టీలో చేరారు. రాజకీయ అనుభవం లేకపోయినా ఆయన మాట తీరు, ప్రజల్లోకి వెళ్లే పద్ధతి, సోషల్ మీడియాలో చురుకుదనం బీజేపీ నాయకత్వాన్ని ఆకట్టుకున్నాయి. తమిళనాడులో ద్రవిడ పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో బీజేపీకి ఒక కొత్త ముఖం అవసరమైన పరిస్థితి ఉంది. అన్నామలై ఆ ఖాళీని వేగంగా భర్తీ చేశారు. సాధారణ రాజకీయ నాయకుడిలా కాకుండా మాజీ పోలీస్ అధికారిగా ప్రజల ముందుకు రావడం ఆయనకు ప్రత్యేక బలం అయింది. బీజేపీలో చేరిన కొద్ది కాలానికే ఆయనను కీలక నాయకుడిగా పార్టీ గుర్తించింది. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన వ్యక్తి నుంచి తమిళనాడు బీజేపీ భవిష్యత్ ముఖచిత్రంగా ఎదగడం ఆయన ప్రయాణంలో తొలి కీలక మలుపు.**

**• పార్టీలోకి వచ్చి.. అధ్యక్ష పీఠం వరకు**

బీజేపీలో చేరిన అన్నామలై ఎదుగుదల సాధారణ రాజకీయ ప్రయాణం కాదు. 2021లో ఆయన తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటికి పార్టీకి రాష్ట్రంలో పరిమితమైన రాజకీయ స్థానం మాత్రమే ఉంది. ద్రవిడ మున్నేట్ర కజగం, అన్నాడీఎంకే వంటి బలమైన ప్రాంతీయ పార్టీల మధ్య బీజేపీకి ప్రత్యేక స్థానం సంపాదించడం అంత సులభం కాదు. కానీ అన్నామలై ఆ సవాల్‌ను స్వీకరించారు. పార్టీని కేవలం పొత్తుల మీద నడపడం కాకుండా స్వతంత్ర శక్తిగా నిర్మించాలన్న ఆలోచనను ఆయన ముందుకు తెచ్చారు. డీఎంకే నేతలపై నేరుగా విమర్శలు చేయడం, అవినీతి ఆరోపణలను ప్రస్తావించడం, తమిళనాడులో బీజేపీకి కొత్త రాజకీయ భాషను తీసుకురావడం ప్రారంభించారు. సభల్లో ఆయన ప్రసంగాలు, మీడియా ముందు ఆయన దూకుడు, సోషల్ మీడియాలో ఆయన చురుకుదనం పార్టీకి కొత్త ఉత్సాహం ఇచ్చాయి. ముఖ్యంగా యువతలో ఆయనకు గుర్తింపు పెరిగింది. బీజేపీని సాంప్రదాయ రాజకీయ పరిమితుల నుంచి బయటకు తీసుకురావాలని ఆయన ప్రయత్నించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాలుగు స్థానాలు గెలిచింది. ఓటు శాతం 2.62గా నమోదైంది. అది పెద్ద విజయం కాకపోయినా అన్నామలై నేతృత్వంలో పార్టీకి ప్రత్యేక రాజకీయ గుర్తింపు ఏర్పడింది. తమిళనాడులో బీజేపీకి ఒక శక్తివంతమైన రాష్ట్ర నాయకత్వం అవసరమైతే.. అన్నామలై ఆ పాత్రను దూకుడుతో స్వీకరించారు. దీంతో ఆయన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా మాత్రమే కాకుండా బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టిలో పడిన యువ నాయకుడిగా ఎదిగారు.

**• పాదయాత్రతో బీజేపీకి కొత్త ఊపు**

అన్నామలై రాజకీయ ప్రయాణంలో అత్యంత కీలక ఘట్టం 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్ర. తమిళనాడులోని మొత్తం 39 లోక్‌సభ నియోజకవర్గాలను కవర్ చేస్తూ దాదాపు 1,700 కిలోమీటర్ల మేర ఆయన ప్రయాణించారు. ప్రజల మధ్యకు వెళ్లి బీజేపీ సిద్ధాంతాలను వివరించడం, డీఎంకే పాలనపై విమర్శలు చేయడం, తమిళనాడులో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరమని చెప్పడం ఆయన ప్రచారానికి ప్రధాన అంశాలుగా మారాయి. ఈ పాదయాత్ర బీజేపీకి రాష్ట్రంలో కనిపించే రాజకీయ శక్తిని ఇచ్చింది. 2019లో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తమిళనాడులో సుమారు 3.62 శాతం ఓట్లు వచ్చాయి. 2024లో ఆ ఓటు శాతం 11.38 శాతానికి పెరిగింది. ఒక్క సీటు కూడా గెలవకపోయినా ఓటు శాతం పెరగడం అన్నామలై రాజకీయ వ్యూహానికి బలమైన సంకేతంగా నిలిచింది. తమిళనాడులో బీజేపీకి ఇంత స్థాయిలో ఓటు శాతం రావడం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. అన్నామలై పేరు రాష్ట్ర రాజకీయాల్లో బలంగా స్థిరపడింది. బీజేపీని కేవలం జాతీయ పార్టీగా కాకుండా తమిళనాడులో స్వతంత్ర రాజకీయ ప్రత్యామ్నాయంగా చూపించాలన్న ప్రయత్నం ఆయనది. డీఎంకే, అన్నాడీఎంకే రాజకీయాల మధ్య బీజేపీకి మూడో స్థానం నిర్మించాలనే ఆలోచన స్పష్టమైంది. అయితే ఆయన దూకుడు అందరికీ నచ్చలేదు. మిత్రపక్షమైన అన్నాడీఎంకే నేతలపై కూడా ఆయన చేసిన విమర్శలు పొత్తు సంబంధాలను దెబ్బతీశాయి. అయినప్పటికీ అన్నామలై వెనక్కి తగ్గలేదు. అదే దూకుడు ఆయనకు ప్రజల్లో గుర్తింపు తెచ్చింది.. అదే దూకుడు పార్టీ అంతర్గతంగా సమస్యలకు కారణమైంది.

**• అన్నాడీఎంకేతో పొత్తు.. అసలు విభేదం ఇక్కడే**

అన్నామలై రాజకీయ ప్రయాణంలో అసలు మలుపు బీజేపీ, అన్నాడీఎంకే సంబంధాల దగ్గర వచ్చింది. తమిళనాడులో బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని అన్నామలై భావించారు. ప్రాంతీయ పార్టీలపై ఆధారపడకుండా బూత్ స్థాయి నుంచి పార్టీని నిర్మించాలని ఆయన ప్రయత్నించారు. కానీ ఎన్నికల రాజకీయాల్లో బీజేపీకి అన్నాడీఎంకే అవసరమనే వాదన పార్టీ కేంద్ర నాయకత్వంలో బలపడింది. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ మళ్లీ అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంది. ఈ నిర్ణయం అన్నామలై ఆలోచనలకు పూర్తిగా విరుద్ధంగా మారింది. పొత్తు విషయంలో ఆయనకు ఉన్న అభ్యంతరాలు పార్టీ పెద్దలకు స్పష్టంగా తెలియజేసినప్పటికీ నిర్ణయం మారలేదు. తర్వాత అన్నామలైను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించి నైనార్ నాగేంద్రన్‌ను కొత్త అధ్యక్షుడిగా నియమించారు. ఎన్నికల నిర్వహణలో కూడా అన్నామలై పాత్ర క్రమంగా తగ్గింది. ఆరు నియోజకవర్గాలకు ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి ఆయన తప్పుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కమిటీలో కూడా ఆయనకు చోటు లేకుండా పోయింది. ఆయన ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఇక్కడే అన్నామలై, బీజేపీ మధ్య రాజకీయ దూరం బహిరంగంగా కనిపించడం మొదలైంది. పార్టీని స్వతంత్రంగా పెంచాలనుకున్న నాయకుడికి పొత్తు రాజకీయాలు పరిమితులు విధించాయి. మరోవైపు కేంద్ర నాయకత్వం మాత్రం డీఎంకేను ఎదుర్కొనేందుకు విస్తృత కూటమి అవసరమని భావించింది. ఈ రెండు వ్యూహాల మధ్య రాజీ కుదరలేదు. చివరకు అన్నామలై పార్టీకి రాజీనామా చేసే దిశగా వెళ్లారు. ఇది ఒక్కరోజులో తీసుకున్న నిర్ణయం కాదు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే.. 2025 అక్టోబర్, నవంబర్ నుంచే బీజేపీ పెద్దలతో తన విభేదాలపై చర్చలు సాగుతున్నాయి.

**• ఢిల్లీ నిర్ణయాలు.. గుజరాత్ మోడల్‌పై తిరుగుబాటు**

బీజేపీకి రాజీనామా చేసిన తర్వాత అన్నామలై చేసిన వ్యాఖ్యలు ఆయనలో పేరుకుపోయిన అసంతృప్తిని మరింత స్పష్టంగా బయటపెట్టాయి. తమిళనాడుకు సంబంధించిన కీలక నిర్ణయాలు ఢిల్లీలోనే తీసుకోవడం ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర నాయకత్వానికి తగిన స్వేచ్ఛ ఇవ్వడం లేదని విమర్శించారు. తమిళనాడు బీజేపీ కోర్ కమిటీ సమావేశం కేంద్ర హోం మంత్రి అమిత్ షా నివాసంలో జరగడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. రాష్ట్ర పార్టీ నిర్ణయాలు తమిళనాడు నేలపైనే తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక సమావేశంపై విమర్శ కాదు. దేశవ్యాప్తంగా ఒకే విధమైన రాజకీయ నిర్ణయాలు అమలు చేయడం కాకుండా ప్రతి రాష్ట్రానికి అక్కడి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా స్వేచ్ఛ ఉండాలని అన్నామలై వాదించారు. అదే సమయంలో జాతీయ ప్రాజెక్టులు గుజరాత్ వైపు ఎక్కువగా వెళ్తున్నాయని ఆయన విమర్శించారు. ఏఐ సంస్థలు, ఇతర కంపెనీలు, కామన్వెల్త్ గేమ్స్, పోలీస్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ వంటి అంశాల్లో గుజరాత్‌కు ప్రాధాన్యం లభిస్తోందని ప్రశ్నించారు. "గుజరాత్ కేంద్రంగా దేశ అభివృద్ధి జరగకూడదు" అన్న ఆయన వ్యాఖ్యలు బీజేపీ అంతర్గత వ్యవహారంపై బహిరంగ తిరుగుబాటు స్వరంగా మారాయి. మేకెదాటు ప్రాజెక్టుపై కేంద్రం వైఖరిలో మార్పును కూడా ఆయన ప్రశ్నించారు. కర్ణాటక ఎన్నికల ప్రయోజనాలు, తమిళనాడు రాజకీయ ప్రయోజనాల ఆధారంగా విధానాలు మారకూడదని అన్నారు. భాష విషయంలో కూడా ఆయన స్వతంత్ర వైఖరిని ప్రదర్శించారు. మూడు భాషల విధానంపై తమిళనాడు ప్రజల్లో ఆందోళన ఉందని, విద్యార్థులపై అదనపు ఒత్తిడి పెరగవచ్చని బహిరంగంగా చెప్పారు. బీజేపీకి చెందిన నాయకుడిగానే కేంద్ర విధానంపై ప్రశ్నలు వేయడం ఆయన రాజకీయ స్వాతంత్ర్యానికి మరో సంకేతంగా నిలిచింది.





**• బీజేపీకి గుడ్‌బై.. తమిళబాటలో కొత్త ప్రయోగం**

2026 జూన్‌లో అన్నామలై బీజేపీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత "వీ ద లీడర్స్" అనే ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించారు. రాజకీయంగా ఇది ఆయన జీవితంలో మరో కొత్త అధ్యాయం. బీజేపీ నుంచి బయటకు వచ్చినా జాతీయతకు తాను వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తనకు గౌరవం కొనసాగుతుందని చెప్పారు. అయితే తమిళనాడు రాజకీయాలను తమిళనాడు ప్రజల అవసరాలు, స్థానిక నాయకత్వం, రాష్ట్ర ప్రయోజనాల ఆధారంగా నడపాల్సిన అవసరం ఉందని ఆయన చెబుతున్నారు. అన్నామలై రూపాంతరం ఇక్కడే పూర్తిగా కనిపిస్తుంది. ఐపీఎస్ అధికారి నుంచి బీజేపీ నాయకుడిగా.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా.. ఆ తర్వాత కేంద్ర నాయకత్వాన్ని ప్రశ్నించే తమిళనాడు నాయకుడిగా ఆయన మారారు. ద్రవిడ పార్టీలను ఎదుర్కొనేందుకు బీజేపీకి ప్రత్యామ్నాయ రాజకీయ స్థలం సృష్టించాలని ప్రయత్నించిన ఆయన చివరకు అదే పార్టీ నుంచి బయటకు వచ్చి తనకంటూ కొత్త రాజకీయ స్థలం వెతుక్కోవాల్సి వచ్చింది. 2026 ఎన్నికల్లో బీజేపీ ఓటు శాతం 2.99 శాతానికి పడిపోయింది. ఒక్క అసెంబ్లీ సీటుకే పరిమితమైంది. ఇదే సమయంలో విజయ్ నేతృత్వంలోని టీవీకే కొత్త రాజకీయ శక్తిగా ఎదిగింది. తమిళనాడు ఓటరు కొత్త ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నాడన్న సంకేతాలు కనిపించాయి. అన్నామలై కూడా తన రాజకీయ ప్రయోగాన్ని అదే నేపథ్యంతో ముందుకు తీసుకెళ్తున్నారు. తమిళం, తమిళనాడు ప్రయోజనాలు, స్థానిక నాయకత్వం, జాతీయత కలిసిన కొత్త రాజకీయ నమూనా తన లక్ష్యమని ఆయన చెబుతున్నారు. మాజీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బయటకు వచ్చిన ఆయన ఇప్పుడు పార్టీకి ప్రత్యర్థిగా మారతారా, మిత్రుడిగా ఉంటారా, లేక స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదుగుతారా అన్నది భవిష్యత్ నిర్ణయించాల్సిన విషయం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. బీజేపీలోకి వచ్చినప్పుడు అన్నామలై పార్టీకి దూకుడు ఇచ్చారు.. బీజేపీని వీడేటప్పుడు మాత్రం తన రాజకీయ స్వాతంత్ర్యానికి కొత్త నిర్వచనం ఇచ్చారు. "సింగం"గా ప్రారంభమైన ఆయన ప్రయాణం ఇప్పుడు "తమిళబాట"లోకి మళ్లింది. బీజేపీకి ఇది ఒక నాయకుడి నిష్క్రమణ మాత్రమే కాదు. తమిళనాడులో పార్టీ భవిష్యత్ వ్యూహంపై పెద్ద ప్రశ్నగా మారింది.

**• అన్నామలై ముందు రాజకీయ దారులు**

బీజేపీకి గుడ్‌బై చెప్పిన అన్నామలై ముందు ఇప్పుడు మూడు ప్రధాన రాజకీయ ఆప్షన్లు కనిపిస్తున్నాయి. మొదటిది.. "వీ ద లీడర్స్" ఉద్యమాన్ని బలమైన తమిళనాడు రాజకీయ శక్తిగా మార్చడం. బీజేపీ నుంచి బయటకు వచ్చిన ఆయనకు ఇప్పటికే ఉన్న వ్యక్తిగత ఇమేజ్, యువతలో గుర్తింపు, ఐపీఎస్ నేపథ్యం, దూకుడు రాజకీయ శైలి కొంత బలంగా నిలుస్తాయి. రెండోది.. తమిళనాడులో కొత్త ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులతో అవగాహనకు వెళ్లడం. విజయ్ టీవీకే వంటి కొత్త రాజకీయ ప్రయోగాలు బలపడుతున్న సమయంలో అన్నామలైకి ఇలాంటి కలయికలు కొత్త సమీకరణాలకు దారి తీయవచ్చు. మూడోది.. భవిష్యత్‌లో బీజేపీతో మళ్లీ దగ్గరవడం. ప్రస్తుతం ఆయన చేసిన విమర్శల తీవ్రత చూస్తే ఇది వెంటనే జరిగే అవకాశం తక్కువగా కనిపించినా రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు ఉండవు. అయితే అన్నామలై రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించేది ఆయన బీజేపీ వ్యతిరేకత కాదు.. తమిళనాడు సమస్యలను స్థానికంగా అర్థం చేసుకుని, వాటికి ప్రత్యామ్నాయ పాలనా నమూనా చూపించగలరా లేదా అన్నదే. ఇప్పటివరకు ఆయన బలంగా కనిపించింది ప్రత్యర్థులపై దాడుల్లో. ఇకపై అసలు పరీక్ష ప్రజల కోసం తన సొంత అజెండాను నిర్మించడంలో ఉంటుంది. బీజేపీని ప్రశ్నించిన తమిళ నాయకుడిగా మాత్రమే మిగిలిపోతారా.. లేక తమిళనాడులో కొత్త రాజకీయ కేంద్రంగా ఎదుగుతారా అన్నదే అసలు ప్రశ్న. అన్నామలై కథ ముగియలేదు.. బీజేపీ అధ్యాయం మాత్రమే ముగిసింది.

## ఇంకా చాలా ఉంది!

**ఐపీఎస్ నుంచి రాజకీయాల్లోకి**

కర్ణాటకలో ఐపీఎస్ అధికారిగా "సింగం" ఇమేజ్ తెచ్చుకున్న కె. అన్నామలై 2019లో ఉద్యోగానికి రాజీనామా చేసి 2020లో బీజేపీలో చేరారు. 2021లో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడయ్యారు. సాధారణ రాజకీయ శైలికి భిన్నంగా దూకుడైన ప్రసంగాలు, డీఎంకేపై ప్రత్యక్ష విమర్శలతో యువతలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

**పాదయాత్రతో పెరిగిన బలం**

2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు అన్నామలై చేపట్టిన దాదాపు 1,700 కిలోమీటర్ల పాదయాత్ర బీజేపీకి తమిళనాడులో భారీ ప్రచార బలం ఇచ్చింది. 2019లో సుమారు 3.62 శాతంగా ఉన్న పార్టీ ఓటు శాతం 2024లో 11.38 శాతానికి పెరిగింది. ఒక్క సీటు గెలవకపోయినా బీజేపీని రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మార్చారు.

**అన్నాడీఎంకే పొత్తుతో అసలు విభేదం**

తమిళనాడులో బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని అన్నామలై కోరుకున్నారు. అయితే 2026 అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర నాయకత్వం అన్నాడీఎంకేతో పొత్తుకు వెళ్లింది. ఈ నిర్ణయాన్ని అన్నామలై వ్యతిరేకించారు. పార్టీని బూత్ స్థాయి నుంచి నిర్మించాలన్న ఆయన వ్యూహానికి కూటమి రాజకీయాలు భిన్నంగా ఉండటంతో కేంద్ర నాయకత్వంతో ఆయనకు దూరం పెరిగింది.

**ఢిల్లీ నిర్ణయాలపై తిరుగుబాటు**

రాజీనామా తర్వాత అన్నామలై తన అసంతృప్తిని బహిరంగంగా వెల్లడించారు. తమిళనాడు రాజకీయ నిర్ణయాలు ఢిల్లీలో తీసుకోవడం, రాష్ట్ర నాయకులకు తగిన స్వేచ్ఛ లేకపోవడాన్ని ప్రశ్నించారు. మేకెదాటు ప్రాజెక్టుపై కేంద్ర వైఖరి మార్పుతో పాటు జాతీయ ప్రాజెక్టులు గుజరాత్‌కు అధికంగా వెళ్తున్నాయన్న అంశంపైనా విమర్శలు చేశారు.

**బీజేపీ తర్వాత కొత్త రాజకీయ ప్రయోగం**

2026 జూన్‌లో బీజేపీకి గుడ్‌బై చెప్పిన అన్నామలై "వీ ద లీడర్స్" అనే ఉద్యమాన్ని ప్రారంభించారు. జాతీయతకు తాను వ్యతిరేకం కాదని చెబుతూనే తమిళనాడు ప్రయోజనాలకు స్థానిక నాయకత్వం అవసరమని వాదిస్తున్నారు. ఇప్పుడు ఆయన ముందు సొంత రాజకీయ శక్తిని నిర్మించడం, కొత్త పార్టీలతో అవగాహన, భవిష్యత్‌లో బీజేపీతో మళ్లీ దగ్గరవడం వంటి అవకాశాలు ఉన్నాయి.





# 2027 వరల్డ్‌కప్ టీమ్‌లో మార్పులు

## సూర్యవంశీకి చోటు.. సీనియర్లకు షాక్

2027 వన్డే ప్రపంచకప్ కోసం మాజీ భారత క్రికెటర్ రాబిన్ ఉతప్ప ప్రకటించిన జట్టు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి చోటు కల్పిస్తూ ఉతప్ప సంచలన నిర్ణయం తీసుకున్నాడు. శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ వంటి రెగ్యులర్ బ్యాటర్లను కొనసాగించినా.. యశస్వి జైస్వాల్‌కు మాత్రం స్థానం ఇవ్వలేదు. వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌కు బదులుగా సంజూ శాంసన్‌ను ఎంపిక చేశాడు. రోహిత్ భవిష్యత్‌పై ప్రశ్నలు వస్తున్న సమయంలోనూ అతడిని జట్టులో కొనసాగించడం మరో ఆసక్తికర అంశంగా మారింది. బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్‌తో పాటు ఐపీఎల్‌లో అదరగొట్టిన భువనేశ్వర్ కుమార్‌కు మళ్లీ చోటు ఇచ్చాడు. దాదాపు ఐదేళ్లుగా భారత్ తరఫున వన్డే ఆడని భువీని ఎంపిక చేయడం కూడా సంచలనంగా మారింది. రవీంద్ర జడేజాను తిరిగి తీసుకున్న ఉతప్ప.. వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాలను పక్కనపెట్టాడు. ఈ జట్టును ఉతప్ప "బాంబ్ స్క్వాడ్"గా అభివర్ణించాడు.



# హెడ్డింగ్లీలో పాక్‌కు షాక్

**• దుమ్మురేపిన ఇంగ్లండ్ • బజ్‌బాల్ తర్వాత బంపర్**

బజ్‌బాల్ శకం ముగిసిన తర్వాత కొత్త టెస్ట్ ప్రయాణాన్ని ఇంగ్లండ్ ఘన విజయంతో ప్రారంభించింది. హెడ్డింగ్లీలో జరిగిన తొలి టెస్టులో బాబర్ ఆజమ్ లేని పాకిస్థాన్‌ను ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తొలుత పాక్ 171 పరుగులకే ఆలౌట్ కాగా, ఇంగ్లండ్ 409 పరుగులు చేసి 238 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది.

### పేసర్ల ధాటికి పాక్ పతనం

రెండో ఇన్నింగ్స్‌లో 51/2తో ఉన్న పాకిస్థాన్ ఒక్కసారిగా కుప్పకూలింది. కేవలం 25 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయిన పాక్.. చివరకు 135 పరుగులకే ఆలౌటైంది. జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్, ఒల్లీ రాబిన్సన్ చెరో మూడు వికెట్లు తీసి పాక్ బ్యాటింగ్‌ను దెబ్బతీశారు.

### రాబిన్సన్ అదుర్స్.. రూట్ శుభారంభం

రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8/80తో ఒల్లీ రాబిన్సన్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. జోష్ టంగ్ 8/89తో సత్తా చాటాడు. మరోవైపు రెండోసారి పూర్తి స్థాయి టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన జో రూట్‌కు ఈ విజయం ప్రత్యేకంగా నిలిచింది. మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ బలమైన శుభారంభం చేసింది.

# ఇంగ్లండ్‌లో పాక్‌కు తీరని చెత్త రికార్డు

### 16 ఏళ్లు.. 27 ఇన్నింగ్స్‌లు.. అదే కథ

ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్‌కు మరోసారి చేదు అనుభవం ఎదురైంది. ఇంగ్లండ్‌తో హెడ్డింగ్లీలో జరుగుతున్న తొలి టెస్టులో పాక్ ఓపెనర్ల వైఫల్యంతో 16 ఏళ్లుగా కొనసాగుతున్న చెత్త రికార్డు మరింత పొడిగింది. టెస్టుల్లో ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ చివరిసారిగా 50కిపైగా పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం సాధించింది 2010లో. అప్పట్లో సల్మాన్ బట్, ఇమ్రాన్ ఫర్హత్ కలిసి 56 పరుగులు జోడించారు. ఆ తర్వాత ఇప్పటివరకు 27 ఇన్నింగ్స్‌ల్లో ఒక్కసారి కూడా 50 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం నమోదు కాలేదు. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ



పాక్‌కు ఆరంభమే షాక్ ఇచ్చింది. జోఫ్రా ఆర్చర్ ఇమామ్ ఉల్ హక్‌ను డకౌట్ చేయడంతో పాక్ కష్టాల్లో పడింది. ఆ తర్వాత అజాన్ అవైస్‌ను కూడా ఆర్చర్ పెవిలియన్ పంపాడు. దీంతో పాక్ 13 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే ఆలౌటైన పాక్‌పై ఇంగ్లండ్ భారీ ఆధిక్యం సాధించింది. ఓపెనింగ్ భాగస్వామ్యం లోపమే పాక్‌కు పెద్ద సమస్యగా మారింది.



# 22 ఏళ్ల కేసు.. క్రికెటర్‌కు విముక్తి

### జాకబ్ మార్టిన్‌కు కోర్టు క్లీన్‌చిట్


మాజీ భారత క్రికెటర్ జాకబ్ మార్టిన్‌కు 22 ఏళ్ల క్రిమినల్ కేసులో భారీ ఊరట లభించింది. 2004లో నమోదైన కేసులో నకిలీ యూకే ఇమ్మిగ్రేషన్ స్టాంప్, ప్రయాణ ఏర్పాట్లు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను నిరూపించే నమ్మకమైన ఆధారాలు లేవని పాటియాలా హౌస్ కోర్టు తేల్చింది. దీంతో మార్టిన్‌పై ఉన్న అన్ని అభియోగాల నుంచి ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. కేసులో పలువురు సాక్షులు కూడా ఆరోపణలను నిర్ధారించలేకపోయారు. తన పేరు అసలు ఎఫ్ఐఆర్‌లో లేదని, అంతర్జాతీయ క్రికెటర్ కావడంతో తర్వాత దర్యాప్తులో తనను కేసులో చేర్చారని జాకబ్ మార్టిన్ తెలిపారు. ఈ కేసు కారణంగా 22 ఏళ్ల పాటు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నానని, రైల్వే ఉద్యోగాన్ని కూడా కోల్పోయానని చెప్పారు. ఇప్పుడు కోర్టు తీర్పుతో తన జీవితంలో ఇది కీలక మలుపు అని పేర్కొన్నారు. మార్టిన్ భారత్ తరఫున 10 వన్డేలు ఆడి 158 పరుగులు చేశారు. 22 ఏళ్ల న్యాయపోరాటం తర్వాత వచ్చిన ఈ విముక్తి తనకు ఎంతో ఉపశమనం ఇచ్చిందని ఆయన తెలిపారు.

# వందకోట్ల క్లబ్బులోకి డిసి మూవీ




టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

# ఇరుముడి ఎమోషనల్ డ్రామా



రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్ (రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ (నక్షత్ర), భార్య కావేరి (ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ. తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.



# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీభోర్సే

### వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ 'సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ 'సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన', 'ఏక్ దివానే కీ దివానియత' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన' చిత్రంలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించింది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ సరసన కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'సేయోన' సినిమాలో నటిస్తోంది.






# నటి షావుకారు జానకి కన్నుమూత

### షావుకారు సినిమాతో పేరు స్థిరం

తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్ఠాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.